శుక్రవారం
29-12-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 187
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

'ఫతా-2' ప్రయోగం విజయవంతం

ఇస్లామాబాద్: దేశీయంగా తయారు చేసిన మల్టిలాంచ్ రాకెట్ వ్యవస్థ ఫతా-2ను పాకిస్థాన్ విజయవంతంగా ప్రయోగించింది. 400 కిమీల దూరంలోని లక్ష్యాన్ని ఛేదించే సామర్థ్యం గల ఫతా-2 పరీక్ష విజయవంతమైనట్లు పాక్ సైన్యం తెలిపింది.

ఈ ప్రయోగాన్ని త్రివిధ దళాధిపత్రులు వీక్షించారు. దీనిని శాస్త్రవేత్తలు, ఇంజినీర్లకు అంకితమిచ్చారు. ఈ ఏడాది అక్టోబరులో బాలిస్టిక్ క్షిపణి పాక్ ప్రయోగించింది. కాగా, 2021, ఆగస్టులో ఫతా-1ను విజయవంతంగా పరీక్షించింది.

ఆగని కసరత్తు

- సీనియర్లకు పిలుపు
- సీఎంను కలిసిన బాలినేని, వసంత కృష్ణప్రసాద్
- గురజాలలో వర్గ విభేదాలు
- పి.గన్నవరంలో పోటాపోటీ భేటీలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
వైసీపీలో ఇన్‌చార్జిల మార్పు రచ్చ కొనసాగుతోంది. రాబోయే ఎన్నికల్లో టికెట్లు దక్కవని తెలిసిన ఎమ్మెల్యేలంతా తమ అనుచరులతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించడం పార్టీకి తలనొప్పిగా మారింది. రోజురోజుకీ అసంతృప్తులు పెరిగిపోతున్నారు. వైసీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్ వరుసగా జిల్లాల సమీక్షలు నిర్వహిస్తూ, ఇన్‌చార్జిల మార్పులపై ముందుకు పోతున్నారు. అటు పాలన, ఇటు పార్టీలో ప్రక్షాళన తీసుకురావడం కోసం కసరత్తు చేస్తున్నారు. దాదాపు 40 నుంచి 60 నియోజకవర్గాల్లో ఇన్‌చార్జిల మార్పు ఉంటుందన్న సమాచారంతో ఎమ్మెల్యేలలో ఆందోళన రోజురోజుకూ పెరుగుతోంది. చాలా నియోజకవర్గాల్లో టికెట్లు దక్కని వారంతా తిరుగుబావుటా ఎగురవేస్తున్నారు. కొందరు ఎమ్మెల్యేలు అధిష్టానం గీత దాటబోమని చెబుతూనే తమ అనుచరులతో నిరసనలు చేయిస్తున్నారు. మంత్రులతో పాటు సీనియర్ ఎమ్మెల్యేలు, పార్టీ ప్రారంభం నుంచి ఉన్న వారిని సైతం సర్వేల ఆధారంగా స్థానచలనం కలిగించడం, టికెట్లు లేదని జగన్ తెగేసి చెప్పడం

- మిగతా 2 లో

పెన్షన్‌లకు ప్రతి నెలా
రూ.1950 కోట్లు

- జనవరి నుంచి 3 వేలకు పెంపు
- విశ్వసనీయతకు మారుపేరు వైసీపీ
- సమీక్షలో సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
పెన్షన్‌ల కోసం గత ప్రభుత్వం నెలకు కేవలం రూ.400 కోట్లు ఖర్చు పెడితే తమ ప్రభుత్వం ప్రతి నెలా రూ.1950 కోట్లు వెచ్చిస్తోందని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చెప్పారు. జిల్లా కలెక్టర్లతో క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం జగన్ వైయస్సార్ పెన్షన్ కానుక, వైయస్సార్ ఆసరా, వైయస్సార్ చేయూత, అంబేద్కర్ విగ్రహం ప్రారంభోత్సవం తదితర కార్యక్రమాలపై గురువారం దిశానిర్దేశం చేశారు. జనవరిలో 3 నుంచి ఫిబ్రవరిలో ఒకటి మధ్య నాలుగు ప్రధాన కార్యక్రమాలు చేస్తున్నామని, ఈ కార్యక్రమాల నిర్వహణలో ఎక్కడా పొరపాట్లు లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి కార్యక్రమానికి ప్రీలాంచ్, లాంచ్, పోస్టులాంచ్ కార్యక్రమాలు ఉంటాయన్నారు. అవి సక్రమంగా నడిచేలా కలెక్టర్లు షెడ్యూల్ చేసుకోవాలని, జనవరి 1 నుంచి వైయస్సార్ పెన్షన్ కానుక రూ.3 వేలకు పెంపు చేస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని పూర్తిగా నెరవేరుస్తూ విశ్వసనీయతకు ఈ ప్రభుత్వం మారు పేరు అని రుజువు చేస్తున్నామని సీఎం అన్నారు. జనవరి 1 నుంచి 8వ తారీకు వరకూ పెన్షన్ల పంపిణీ ఉంటుందన్నారు. 2019లో మన ప్రభుత్వం రాకముందు ఎన్నికలకు 2 నెలల ముందు వరకూ పెన్షన్ కేవలం రూ.1000 మాత్రమే ఇచ్చేవారని, మనం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.2,250 చేశామన్నారు. ఇప్పుడు రూ.3 వేల వరకూ పెంచుకుంటూ వచ్చామని వివరించారు. గత ప్రభుత్వంలో పెన్షన్ల సంఖ్య 39 లక్షలైతే ఇవాళ ఆ సంఖ్య దాదాపు 66 లక్షలకు చేరిందన్నారు. అందరికీ సత్వర సేవలందించేందుకు వలంటీర్ - సచివాలయ వ్యవస్థను గ్రామస్థాయిలో తీసుకువచ్చామన్నారు. ఒకటో తారీఖు ఆదివారమైనా, పండుగైనా...పొద్దునే అవ్వతాతలకు వలంటీర్లు పెన్షన్ అందిస్తున్నారని తెలిపారు. విజయవాడలో ఏర్పాటు చేస్తున్న అంబేద్కర్ విగ్రహాన్ని జనవరి 19వ తేదీన ఆవిష్కరిస్తున్నామని, దీనికి ప్రతి సచివాలయం నుంచి ఐదుగురిని ఆహ్వానించాలని తెలిపారు. వైఎస్సార్ ఆసరా జనవరి 23 నుంచి 31 వరకు జరుగుతుందని, దీనిద్వారా 78.94 లక్షల మంది

- మిగతా 2 లో

ప్రియాంకకు ఈడీ షాక్

భూ విక్రయంలో ప్రమేయం ఉందని అభియోగం
మనీలాండరింగ్ ఛార్జిషీట్‌లో పేరు

న్యూదిల్లీ:
మరి కొద్ది నెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న తరుణంలో కేంద్రంలోని బీజేపీ సర్కారు మరో మారు కీలక ప్రతిపక్ష నేతలను రాజకీయంగా ఇరుకున పెట్టేందుకు ప్రయత్నిస్తోంది. తాజాగా మనీలాండరింగ్‌కు సంబంధించిన కేసులో కోర్టుకు దాఖలు చేసిన ఛార్జిషీట్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నాయకురాలు ప్రియాంకగాంధీ, ఆమె భర్త రాబర్ట్ వాద్రా పేర్లను చేర్చింది. ఈ ఏడాది నవంబర్‌లో ఈడీ దిల్లీ కోర్టులో రాబర్ట్ వాద్రాతో సంబంధం ఉన్న ఎన్ఆర్ఐ,

- మిగతా 2 లో

జర్నలిస్టుల ఫోన్లలో పెగాసస్

ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వెల్లడి

న్యూదిల్లీ:
యాపిల్ సంస్థ హెచ్చరికల తర్వాత భారత జర్నలిస్టుల ఫోన్‌లలో పెగాసస్ స్పైవేర్‌ను గుర్తించినట్లు ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ గురువారం తెలిపింది. 'ది వైర్' న్యూస్ వెబ్‌సైట్ ఎడిటర్ సిద్ధార్థ్ వరదరాజన్, ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్ట్ ప్రాజెక్ట్ (ఓసీసీఆర్‌పీ) దక్షిణాసియా ఎడిటర్ ఆనంద్ మంగ్నాలే ఫోన్‌లలో పెగాసెస్ స్పైవేర్ గుర్తించినట్లు వెల్లడించింది. ఓసీసీఆర్‌పీ గతేడాది ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) అధికారులను ఇంటర్వ్యూ చేసిందని, పదినెలల తర్వాత ఆయన ఫోన్‌ను స్పైవేర్ వైరస్ సోకిందని ఆమ్నెస్టీ పేర్కొంది.

కార్పొరేట్ గ్రూప్ గురించి ఓసీసీఆర్‌పీ రూపొందిస్తున్న పరిశోధనాత్మక కథనం కోసం తాను అదానీ గ్రూప్‌కు కొన్ని ప్రశ్నలు పంపినట్లు ఆనంద్ మంగ్నాలే వాషింగ్టన్

- మిగతా 2 లో

డీకేను కలిసిన బాబు

బెంగళూరు:
కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు గురువారం కలుసుకున్నారు. బెంగళూరు విమానాశ్రయంలో ఈ ఇద్దరు ఒకరికొకరు ఎదురుపడ్డారు. కుప్పం వెళ్లేందుకు చంద్రబాబు, హైదరాబాద్ నుంచి బెంగళూరుకు డీకే చేరుకున్న సందర్భంగా ఈ అనుకోని భేటీ జరిగింది. రెండు విమానాలు పక్కనే ఉండటంతో తారసపడిన ఇద్దరు నాయకులు మర్యాదపూర్వకంగా కరచాలనం చేసుకున్నారు. పక్కకు వెళ్లి కాసేపు మాట్లాడుకున్నారు. ఈ ఆకస్మిక భేటీ ఆసక్తికరంగా మారింది.

లక్ష ఓట్లతో కుప్పంలో గెలుస్తాం: చంద్రబాబు

కుప్పంలో లక్ష ఓట్ల మెజారిటీలో టీడీపీ గెలవబోతోందని చంద్రబాబు దీమా వ్యక్తంచేశారు. కుప్పం తనకు స్ఫూర్తి అని, ఏ మంచి కార్యక్రమాన్నైనా ఇక్కడ నుంచే ప్రారంభిస్తానని అన్నారు. బెంగళూరు నుంచి కుప్పం చేరుకున్న బాబు అక్కడ గుడుపల్లిలో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్నారు. వచ్చే 100 రోజులు కష్టపడితే విజయం సిద్ధిస్తుందని పిలుపునిచ్చారు. గుడిపల్లిలో అవినీతి

- మిగతా 2 లో

కాంగ్రెస్ సమరశంఖం

- లోక్‌సభ ఎన్నికల ప్రచారం మొదలు
- నాగపూర్‌లో 'హం తయ్యార్ హై' ప్రారంభం
- అధికారంలోకి రాగానే కులగణన చేపడతాం
- ఈ ఎన్నికలు రెండు సిద్ధాంతాల మధ్య పోరు : రాహుల్
- 'ఇండియా' ఏకమైతే బీజేపీ కనుమరుగు: ఖర్గే

నాగపూర్:
లోక్‌సభ ఎన్నికల సమరశంఖాన్ని కాంగ్రెస్ పూరించింది. పార్టీ 139వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్నికల ప్రచారానికి మహారాష్ట్రలోని నాగపూర్ నుంచి శ్రీకారం చుట్టింది. గురువారం 'హం తయ్యార్ హై' (మేము సిద్ధంగా ఉన్నాం) నినాదంతో మెగా ర్యాలీని చేపట్టింది. కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చింది. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) కేంద్ర కార్యాలయం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బౌద్ధ మతాన్ని స్వీకరించిన చారిత్రక స్థానం 'దీక్షాభూమి' నాగపూర్‌లో ఉండటంతో కాంగ్రెస్ మెగా ర్యాలీకి ప్రాధాన్యత వచ్చింది. లక్షలాది మంది కార్యకర్తలు, అభిమానులు, కాంగ్రెస్ నేత కన్హయ కుమార్, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, సుఖ్విందర్ సింగ్ సూకు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ కేంద్రంలో తమ పార్టీ అధికారంలోకి వస్తుందన్న దీమా వ్యక్తంచేశారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాక కులగణన జరిపి ప్రగతికి కొత్త బాటలు వేస్తామని హామీనిచ్చారు. ప్రస్తుతం దేశంలో రెండు సిద్ధాంతాల మధ్య పోరు సాగుతోందని, సార్వత్రిక ఎన్నికలు కూడా వీటి మధ్య సమరంగానే ఉంటాయని (ఎన్డీయే, ఇండియా కూటములనుద్దేశించి) రాహుల్ అన్నారు. ఎవరిని చూసి భయపడాల్సిన అవసరం లేదని ప్రజలకు పిలుపునిచ్చారు. జరగబోయే ఎన్నికలు రెండు సిద్ధాంతాల మధ్య పోరన్నారు. తామంతా ఐక్యంగా మహారాష్ట్రలోనే కాదు కేంద్రంలోనూ గెలుస్తామని రాహుల్

- మిగతా 2 లో

నటుడు, ఎండీఎంకే అధినేత
విజయకాంత్ కన్నుమూత

- ప్రముఖుల నివాళి
- నేడు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

చెన్నై:
ప్రముఖ తమిళ నటుడు, డీఎండీకే అధ్యక్షుడు విజయకాంత్ (71) కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతూ ఆయన గురువారం ఉదయం మరణించారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్న విజయకాంత్‌ను కుటుంబ సభ్యులు చెన్నైలోని మియాట్ ఇంటర్నేషనల్ హాస్పిటల్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఇటీవలే తీవ్ర అనారోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చికిత్స తీసుకున్న విజయకాంత్... కొన్ని రోజుల క్రితమే డిశ్చార్జి

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ప్రమాదానికి గురయిన రైళ్ళతోనూ, నీళ్ళురాని టాయ్‌లెట్లతోనూ, కిక్కిరిసిన భోగీలతోనూ బోలెడు సెల్ఫీలు ఉన్నాయి సార్..మీకు పంపనా?

ఏపీ భూ హక్కుల చట్టం
రద్దు చేయాలి

అఖిలపక్ష సమావేశంలో చర్చించాలి
సీఎం జగన్‌కు రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర-విజయవాడ:
వైసీపీ ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ఆంధ్రప్రదేశ్ భూ హక్కుల చట్టం (ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 27/2023)ను రద్దు చేయాలని, వాస్తవ భూ హక్కుదారుల ప్రయోజనాల కోసం తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం లేఖ రాశారు. కొత్త చట్టం ఈ ఏడాది అక్టోబర్ 31 నుండి



అమలులోకి వచ్చునట్లు జీవో నంబరు 512 జారీ చేశారని, ఈ చట్టంలోని లోపాలు గుర్తించిన న్యాయనిపుణులు, రైతు, ప్రజాసంఘాలు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టినట్లు

- మిగతా 2 లో

కార్పొరేట్ పాలనను ప్రతిఘటిద్దాం

- 10-20 తేదీల్లో జన జాగరణ ప్రచారోద్యమం
- 26న 500 జిల్లాల్లో ట్రాక్టర్ పరేడ్‌లు
- సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు

న్యూదిల్లీ:
బీజేపీ-ఆర్ఎస్ఎస్ కార్పొరేట్ పాలనను ప్రతిఘటిద్దామని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) పిలుపునిచ్చింది. కనీస మద్దతు ధర, రుణ మాఫీ, విద్యుత్ బిల్లు రద్దు తదితర డిమాండ్ల సాధన కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని సంకల్పించింది. అన్ని డిమాండ్లను పరిష్కరించేంత వరకు పోరు ఆగబోదని కేంద్రప్రభుత్వానికి తేల్చిచెప్పింది. వచ్చేనెల 10 నుంచి 20వ తేదీ వరకు జన జాగరణ ప్రచారాన్ని నిర్వహించాలని అఖిలభారత సర్వసభ్య సమావేశం నిర్ణయించినట్లు ఎస్‌కేఎం గురువారం ఓ ప్రకటన చేసింది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జనవరి 26న దేశంలోని 500 జిల్లాల్లో ట్రాకర్ పరేడ్‌లు నిర్వహించనున్నట్లు పేర్కొంది. జన జాగరణ ప్రచారాన్ని 20 రాష్ట్రాలోని ఎస్‌కేఎం రాష్ట్ర శాఖలు విస్తృత స్థాయిలో నిర్వహిస్తాయని తెలిపింది. ఇందులో భాగంగా ఇంటింటి ప్రచారంతో పాటు కరపత్రాల పంపిణీ ద్వారా మోదీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ ప్రచారం ఉద్దేశమని వెల్లడించింది. రైతు, కార్మికుల వ్యతిరేక విధానాల గురించి ప్రజలకు తెలియజేస్తామని పేర్కొంది. తమ పోరాటంలో కలిసి రావాలని కోరతామని ప్రకటనలో ఎస్‌కేఎం తెలిపింది. 30.40కోట్ల కుటుంబాల్లో కనీసం 40శాతాన్ని చేరుకోనేలా లక్ష్యాన్ని నిర్దేశించేలా రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీలు సమావేశమవుతాయని పేర్కొంది. రిపబ్లిక్ డే సందర్భంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 500 జిల్లాల్లో ట్రాక్టర్ పరేడ్‌లను నిర్వహిస్తామని, అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చింది. ట్రాక్టర్ పరేడ్‌లో పాల్గొనే రైతులు జాతీయ పతాకాలతో పాటు సంఘాల జెండాలను ప్రదర్శిస్తారని,

ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామ్యవాదం రక్షణకు ప్రతిజ్ఞ చేస్తారని పేర్కొంది. ట్రాక్టర్లతో పాటు మోటార్‌బైకులు, ఇతర వాహనాలు పరేడ్‌లో పాల్గొంటాయని వెల్లడించింది. కార్పొరేట్-మతోన్మాద ప్రభుత్వాన్ని ఓడించేందుకు, కుల-మత విభజన ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు జన జాగరణ ప్రచారంతో పాటు ట్రాక్టర్ పరేడ్‌ను విజయవంతం చేయాలని ఎస్‌కేఎం పిలుపునిచ్చింది.

ఇజ్రాయిల్ అదుపులో పలస్తీనా లెఫ్ట్ నేత

జెరూసలేం: గాజాలో ఇజ్రాయిల్ దురాక్రమణ వేళ పలస్తీనాకు చెందిన సీనియర్ లెఫ్ట్ నాయకురాలు ఖలీదా జర్రర్‌ను ఇజ్రాయిల్ సైన్యం అదుపులోకి తీసుకుంది. వెస్ట్‌బ్యాంకులోని ఇంటి నుంచి ఖలీదాను అరెస్టు చేసింది. అల్ బీరే నగరాన్ని సోదా చేసిన ఇజ్రాయిలీ దళాలు, ఖలీదా జర్రర్ ఇంటిని తనిఖీ చేసిన తర్వాత ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు డబ్ల్యూఏఎఫ్‌ఏ నివేదించింది. పలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్‌లో రెండవ అతిపెద్ద వర్గంగా ఉన్న పాపులర్ ఫ్రంట్ ఫర్ ది లిబరేషన్ ఆఫ్ పలస్తీనాలో అగ్రనాయకురాలిగా ఖలీదా జర్రర్ ఉన్నారు. ఇజ్రాయిల్ యుద్ధ నేరాలను అంతర్జాతీయ సంస్థలకు తెలియజేయడానికి అంకితమయ్యారు. దీంతో ఇజ్రాయిలీ దళాలను టార్గెట్‌గా మారారు. ఆమె గతంలోనే అనేకసార్లు అరెస్టు అయ్యారు. 1989లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తొలిసారి అరెస్టు అయ్యారు. మార్చి 8న జరిపిన ర్యాలీలో పాల్గొన్నందుకుగాను నెల రోజులు జైల్లో గడిపారు. 2015లో రామల్లాలోని ఆమె ఇంట్లోకి చొరబడి, తనిఖీలు చేసిన ఇజ్రాయిలీ దురాక్రమణ సైన్యం అనంతరం ఖలిదా జర్రర్‌ను అదుపులోకి తీసుకుంది. విచారణ జరపకుండా రాజకీయ ఖైదీగా ఉన్నారు. ఆమె అరెస్టుకు వ్యతిరేకంగా అంతర్జాతీయ స్థాయిలో నిరసన వ్యక్తమైంది. సైనిక కోర్టులో ఖలిదా జర్రర్ విచారణను ఇజ్రాయిల్ అధికారులు చేపట్టారు. ఆమె రాజకీయ కార్యకలాపాల ఆధారంగా 12 అభియోగాలు నమోదు చేశారు. ప్రసంగాలు చేయడం, పలస్తీనా ఖైదీలు, వారి కుటుంబాలకు మద్దతివ్వడం వంటి నేరాలు ఆమెపై మోపబడ్డాయి. దీంతో ఆమె 15 నెలలు ఖైదులో ఉన్నారు. 2016 జూన్‌లో విడుదలయ్యారు. మళ్లీ 2017 జులైలో అరెస్టుకు గురయ్యారు. ఈసారి ఆమె ఇంటి ప్రవేశద్వారాన్ని బద్దలు కొట్టి లోపలికి చొరబడి, వస్తువులను చెదరగొట్టి, ఐప్యాడ్, మొబైల్‌ఫోన్‌తో పాటు ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకొన్నారు. ఆఫర్ జైల్లో తొలుత విచారణ తర్వాత ఆమెను హేషారాన్ జైలుకు తరలించారు. అక్కడ పలస్తీనాకు చెందిన అనేక మంది మహిళా ఖైదీలు ఉన్నారు. 20 నెలల పాటు జైల్లో ఉన్న తర్వాత 2019 ఫిబ్రవరిలో ఆమె బయటకు వచ్చారు. అదే ఏడాది అక్టోబరు 31న రామల్లాలోని ఇంటి నుంచి ఖలిదా జర్రర్‌ను ఇజ్రాయిల్ సైన్యం అరెస్టు చేసింది. శిక్షా కాలంలో తన ఇద్దరు కుమార్తెల్లో ఒకరైన సుహా చనిపోయారు. 2021, జులై 31న అంత్యక్రియలు జరిగాయి. కుమార్తె అంత్యక్రియలకు తల్లిని అనుమతించాలని అంతర్జాతీయ స్థాయిలో ఉద్యమం జరిగినాగానీ అన్ని ఫిర్యాదులను ఇజ్రాయిల్ ప్రభుత్వం తిరస్కరించింది. ఆమె తన కుమార్తె కడచూపు అందకుండా చేసింది. ఇదిలావుంటే అక్టోబరు 7 నుంచి వెస్ట్‌బ్యాంకులో ఇజ్రాయిల్ దాడుల్లో 300 మందికిపైగా పలస్తీనియన్లు చనిపోగా 3,100 మందికి గాయాలయ్యాయి. సుమారు ఐదు వేల మంది ఇజ్రాయిల్ నిర్బంధంలో ఉన్నట్లు పలస్తీనా ఆరోగ్యశాఖ వెల్లడించింది.

యుద్ధానికి సన్నద్ధం కండి

ఉ.కొరియా సైన్యానికి, రక్షణ రంగానికి కిమ్‌జాంగ్ ఆదేశాలు

ప్యాంగ్యాంగ్: యుద్ధానికి సన్నద్ధం కావాలని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ ఆదేశాలిచ్చారు. దేశ సైన్యంతో పాటు ఆయుధాల పరిశ్రమలు, అణ్వాయుధ రంగానికి సైతం ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశారు. అమెరికా దూకుడుకు కళ్లెం వేయాలని సూచించారు. ఈ మేరకు ఉత్తర కొరియా మీడియా గురువారం నివేదించింది. నూతన సంవత్సరంలోకి అడుగు పెట్టే క్రమంలో కిమ్ సర్కార్ కీలక సమావేశం నిర్వహించింది. కిమ్ మాట్లాడుతూ సామ్రాజ్యవాద వ్యతిరేక దేశాలతో వ్యూహాత్మక సహకారాన్ని ప్యాంగ్యాంగ్ పెంచుకుంటుందని ప్రకటించినట్లు అధికారిక వార్తా సంస్థ కేసీఎన్‌ఏ పేర్కొంది. ఉత్తర కొరియా ఇప్పటికే రష్యా వంటి దేశాలతో సంబంధాలను పటిష్టపర్చుకుంటోంది. దీంతో అమెరికా తీవ్రస్థాయిలో ఆరోపణలకు దిగుతోంది. ఉక్రెయిన్‌పై యుద్ధానికి మాస్కోకు సైనిక పరికరాలను ప్యాంగ్యాంగ్ సరఫరా చేస్తోందని, ఈ దేశ సైనిక సామర్థ్యాలను పెంచుకునేందుకు రష్యా సాంకేతిక సహకారాన్ని అందిస్తోందని అమెరికా ఆరోపణలు చేస్తున్నది. ఈ క్రమంలో యుద్ధ సన్నాహాలు ప్రారంభించాలని పీపుల్స్ ఆర్మీ, ఆయుధాల పరిశ్రమలు, అణ్వాయుధ, పౌర రక్షణ రంగాలకు కిమ్ ఆదేశాలు ఇచ్చినట్లు కేసీఎన్‌ఏ వెల్లడించింది. ఉత్తర కొరియా వర్కర్స్ పార్టీ 8వ కేంద్ర కమిటీ 9వ ప్లీనరీ సమావేశం మంగళవారం ప్రారంభమైంది. 2023 సంవత్సరానికి వీడ్కోలు పలికే క్రమంలో వార్షిక సమీక్ష జరిగింది.

లిబియాలో గ్యాస్ ట్యాంకర్ పేలుడు

40 మంది దుర్మరణం

మోన్‌రోవియా: లిబియాలో గ్యాస్ ట్యాంకర్ పేలి 40 మంది దుర్మరణం చెందారు. మరో 83 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఉత్తర-మధ్య లిబియాలోని బోంగ్ కౌంటీలో జరిగింది. ఈ మేరకు దేశ ఆరోగ్యశాఖ సహాయ మంత్రి ఫ్రాన్సిస్ వెల్లడించినట్లు 'ఫ్రంట్‌పేజ్ ఆఫ్రికా' పేర్కొంది. టొటోటాలోని ముల్బా హిల్ కమ్యూనిటీలో గ్యాస్ ట్రక్కు తిరగబడి ఈ పేలుడు సంభవించినట్లు తెలిపింది. తొలుత 15 మంది చనిపోగా 36 మంది గాయపడినట్లు వార్తలొచ్చాయి. అయితే గురువారం నాటికి మృతులు 40కు పెరిగారని, గాయపడిన వారి సంఖ్య 83కు చేరిందని నివేదికలు తెలిపాయి. మృతుల్లో ఆరేళ్ళ, తొమ్మిదేళ్ల మధ్య వయస్సుగల ముగ్గురు చిన్నారులు ఉన్నట్లు వార్తా నివేదిక పేర్కొంది. క్షతగాత్రులకు ఫిబే ఆసుపత్రిలో చికిత్స అందుతోంది. కొందరిని 14 మిలటరీ హాస్పిటల్, జాన్ ఎఫ్ కెనడీ మెమోరియల్ హాస్పిటల్, ఈఎల్‌డబ్ల్యూఏ హాస్పిటల్‌కు తరలించినట్లు మంత్రి వెల్లడించినట్లు వార్తా నివేదిక తెలిపింది.

పిస్టల్ గ్లాక్ రూపకర్త గాస్టన్ మృతి

వియన్నా: ప్రపంచ వ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన 'పిస్టల్ గ్లాక్' రూపకర్త, ఆస్ట్రియన్ ఇంజినీర్ గాస్టన్ గ్లాక్ (94) కన్నుమూశారు. ఆయన మరణ వార్తను గ్లాక్ కంపెనీ ప్రకటించింది. గ్లాక్ గన్‌ను ప్రపంచ దేశాల భద్రతా దళాలు, నేరగాళ్లు ఇష్టపడతారు. 1929లో ఆస్ట్రియా రాజధాని వియన్నాలో గాస్టన్ గ్లాక్ జన్మించారు. మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. 1980లో సైన్యానికి వస్తు సరఫరా వ్యాపారం చేపట్టారు. 52వ ఏట గ్లాక్ తుపాకీని డిజైన్ చేశారు. ఇది 18 రౌండ్లు కాల్చగలదు. అమెరికాలో దీనికి ఆదరణ లభించింది. హాలీవుడ్ బ్లాక్‌బస్టర్ ది మ్యాట్రిక్స్ రీలోడెడ్ వంటి చిత్రాలతో ఈ గన్ ప్రాచుర్యం పొందింది. ఇరాక్ మాజీ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ అమెరికా సైన్యం నుంచి తప్పించుకొని దాక్కొన్న సమయంలో కూడా ఆయన వద్ద గ్లాక్ గన్ ఉంది. ఈ విషయాన్ని అమెరికా సైన్యం వెల్లడించింది.

కాంగ్రెస్ సమరశంఖం

(మొదటిపేజీ తరువాయి)

ఉద్ఘాటించారు. బీజేపీది నియంత తరహా ఆలోచనని, తన మాటే శాసనమన్నట్లు వ్యవహరిస్తుందని విమర్శించారు. దేశంలో నిరుద్యోగం 40ఏళ్ల గరిష్ఠానికి చేరిందన్నారు. బీజేపీలో అంతర్గతంగా ప్రజాస్వామ్యం లోపించిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీలో జూనియర్లు సైతం అగ్రనేతలతో విభేదించే స్వేచ్ఛ ఉందని చెప్పారు. నేటి యూనివర్సిటీలలో అనేక మంది వీసీలను కేవలం ఓ వ్యవస్థకు విధేయులుగా ఉన్నందునే నియమిస్తున్నారు తప్ప వారి సామర్థ్యాన్ని, ప్రతిభను చూసి కాదని (వీసీలకు ఆర్‌ఎస్‌ఎస్‌తో అనుబంధాన్ని ఉద్దేశించి) రాహుల్ గాంధీ ఆరోపించారు. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ దేశం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఇండియా కూటమికి మద్దతివ్వాలని పిలుపునిచ్చారు. ఇండియా కూటమి ఐక్యంగా బీజేపీని కనుమరుగు చేయగలదని నమ్మకంగా చెప్పారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని గద్దె దించాలని, ఇండియా కూటమిని గెలిపించాలని కోరారు. ప్రజలు మద్దతిస్తే 'న్యాయ యోజన'ను అమలు చేస్తామని, మహిళా సాధికారతకు హామీనిస్తామని చెప్పారు. మహిళా సాధికారతతో సామాజిక సంక్షేమం, కుటుంబ సాధికారత సాధ్యమన్నారు. కాంగ్రెస్‌కు సంబంధించిన పాత సాహిత్యం, ఫొటోలు, లేఖలు, చారిత్రక పత్రాలు ఉంటే వాటిని స్కాన్ చేసి తమకు పంపాలని, వాటిని పొందుపరుస్తామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

గెలుపే లక్ష్యంగా వచ్చే 100 రోజులు శ్రమిద్దాం: రేవంత్ రెడ్డి

కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వ ప్రభుత్వం ఏర్పాటు కోసం వచ్చే 100 రోజులు శ్రమిద్దామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మోదీ పాలనను కాలం చెల్లిన మందుతో పోల్చారు. బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని 'అదానీ-ప్రధాని'గా (గౌతం అదానీ, మోదీకి మధ్య సాన్నిహిత్యాన్ని ఉద్దేశించి) రేవంత్ వర్ణించారు. సుఖ్విందర్ సింగ్ సూకు మాట్లాడుతూ ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ వంటి కాంగ్రెస్ నేతలు దేశం కోసం తమ ప్రాణాలను అర్పించారన్నారు. నెహూ నాయకత్వం, దార్శనికతతో సూది నుంచి విమానాల తయారీ వరకు దేశం ఎదిగిందన్నారు. కన్హయ కుమార్ మాట్లాడుతూ ఇతరులను నిందించడం ద్వారా తన వైపు ఎవరి దృష్టి మళ్లకుండా జాగ్రత్త పడే పిక్‌పాకెట్ తరహాలో బీజేపీ రాజకీయ వ్యూహం ఉందని దుయ్యబట్టారు. కాంగ్రెస్‌ను ఉద్దేశపూర్వకంగా అప్రతిష్ఠపాల్జేయాలని ప్రయత్నిస్తోందని బీజేపీని విమర్శించారు.

పెన్షన్‌లకు ప్రతి నెలా రూ.1950 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

మహిళలకు రూ.6,400 కోట్లు ఇస్తున్నామన్నారు. వైయస్సార్ చేయూత ఫిబ్రవరి 5 నుంచి 14 వరకూ కొనసాగుతుందని, దీనిద్వారా 26 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ఏటా రూ.18,750 ఇస్తున్నామని సీఎం వివరించారు. ఈ నాలుగు కార్యక్రమాలను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. అర్హత ఉండి ఎవరైనా పథకం అందుకోకపోతే రీవెరిఫికేషన్ చేసి ఈ పథకాలు వర్తింపు చేసే బై యాన్యువల్ కార్యక్రమం జనవరి 5న జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం జరిగే లోపే వెరిఫికేషన్ పూర్తి చేసిన దాదాపు 1.17 లక్షల పెన్షన్లు ఒకటో తారీఖు నుంచే ఇస్తామన్నారు. అలా మొత్తంగా 66,34,742మందికి రూ.1968 కోట్లకుపైగా పెన్షన్ల రూపంలో అందుతాయని సీఎం వివరించారు. పెన్షన్‌తోపాటు తన తరపున లేఖను లబ్ధిదారులకు అందించాలని, తాను ఇచ్చే వీడియో సందేశం లబ్ధిదారులకు చేరవేయాలని సూచించారు. వారం పాటు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, ఉత్సాహవంతులు, భావసారూప్యత గల వారంతా పాల్గొనేలా చూడాలని, ఒక పండుగ వాతావరణంలో నిర్వహించాలని సీఎం మార్గనిర్దేశనం చేశారు. సమావేశంలో ఉపముఖ్య మంత్రి(ఎక్సైజ్‌శాఖ) కె.నారాయణస్వామి, గ్రామ, వార్డు సచివాలయాలశాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ వై.శ్రీలక్ష్మి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్, సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి, సెర్ఫ్ సీఈఓ ఏఎండీ ఇంతియాజ్, మెప్మా మిషన్ డైరెక్టర్ వి.విజయలక్ష్మి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

డీకేను కలిసిన బాబు

(మొదటిపేజీ తరువాయి)

పెరిగిపోతుందని, దేవాలయ భూములను ఆక్రమించుకుంటున్నారని వైసీపీ నేతలపై మండిపడ్డారు. ఉపాధి హామీ పనులలో అవినీతి రాజ్యమేలుతుందని, టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే పరిశ్రమలను తెస్తామని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు, తమ పార్టీకి ప్రజలే ఆస్తి, ప్రజలే పెట్టుబడి అని అన్నారు. రాబోయే రోజుల్లో గుడిపల్లి మండలంలోని ప్రతి కుటుంబానికి పాడి ఆవులను మంజూరు చేస్తామన్నారు. స్కూల్ పిల్లలకు బస్సు సౌకర్యం కూడా లేదని, ఆడపిల్లలకు భవిష్యత్, భరోసాను తెలుగుదేశం పార్టీ కల్పిస్తుందని చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయకాంత్ కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

అయ్యారు. అంతలోనే మరోసారి ఆస్పత్రి పాలయ్యారు. విజయకాంత్ మృతిపట్ల ఆయన అభిమానులు, సినీ ప్రముఖులు దిగ్భ్రాంతికి గురయ్యారు. విజయకాంత్ గతంలో మధుమేహం తదితర సమస్యలతోనూ బాధపడ్డారు. విజయకాంత్ అంత్యక్రియలు శుక్రవారం అధికార లాంఛనాలతో జరగనున్నాయి. విజయకాంత్ 1952 ఆగస్టు 25న మధురై(తమిళనాడు)లో జన్మించారు. ఆయన అసలు పేరు నారాయణన్ విజయరాజ్ అళగర్‌స్వామి. చిత్ర పరిశ్రమలో అడుగిడిన తర్వాత విజయకాంత్‌గా మారారు. తల్లిదండ్రులు కేఎన్ అళగర్‌స్వామి, ఆండాళ్ అజగర్‌స్వామి. విజయకాంత్‌కు భార్య ప్రేమలత, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో షణ్ముఖ పాండియన్ 'సగప్తం', 'మధుర వీరన్' చిత్రాల్లో నటించారు.

కాగా, 27 ఏళ్ల వయసులో విజయకాంత్ తెరంగేట్రం చేశారు. ఆయన నటించిన తొలి సినిమా 'ఇనిక్కుమ్ ఇలమై' (1979). ప్రతినాయకుడి పాత్రతోనే ఆయన ప్రేక్షకులకు పరిచయమయ్యారు. అప్పటి నుంచి 2015 వరకు నిర్విరామంగా నటించారు. కెరీర్ ఆరంభంలో పరాజయాలు అందుకున్న విజయకాంత్... ఎస్‌ఏ చంద్రశేఖర్ దర్శకత్వం వహించిన 'దూరతు ఇడి ముళక్కం', 'సత్తం ఓరు ఇరుత్తరై'లతో విజయాలు అందుకున్నారు. 150కి పైగా సినిమాల్లో ఆయన నటించారు. 1984లో ఆయన నటించిన 18 సినిమాలు విడుదలకావడం విశేషం. పోలీసు అధికారిగా 20కి పైగా సినిమాల్లో కనిపించారు. ఆయన నటించిన ఆఖరి సినిమా 'సగప్తం' (2015). తన కెరీర్‌లో విజయకాంత్ కేవలం తమిళ చిత్రాలే తప్ప ఇతర భాషల్లో నటించలేదు. కానీ, ఆయన సినిమాలు తెలుగు, హిందీలో డబ్ అయి అక్కడా మంచి విజయాలు సాధించాయి. ఆయన వందో చిత్రం 'కెప్టెన్ ప్రభాకరన్' బాక్సాఫీసు వద్ద బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. కోలీవుడ్‌లో తెరకెక్కిన తొలి 3డీ చిత్రం విజయకాంత్ నటించిన 'అన్నై భూమి'. ఇందులో ఆయన రాధారవి, కన్నడ నటుడు టైగర్ ప్రభాకర్‌తో కలిసి నటించారు. 'ఈట్టి'లో కన్నడ నటుడు విష్ణువర్ధన్‌తో, 'మనకనక్కు'లో కమల్‌హాసన్‌తో, 'వీరపాండియన్'లో శివాజీ గణేశన్‌తో కలిసి తెర పంచుకున్నారు.

1994లో 'తమిళనాడు స్టేట్ ఫిల్మ్ ఆనరరీ అవార్డు' (ఎంజీఆర్ పురస్కారం), 2001లో 'కళైమామణి అవార్డు' (తమిళనాడు ప్రభుత్వం) అందుకున్నారు. 2001లో 'బెస్ట్ ఇండియన్ సిటిజెన్ అవార్డు', 2009లో 'టాప్ 10 లెజెండ్స్ ఆఫ్ తమిళ్ సినిమా అవార్డు', 2011లో 'ఆనరరీ డాక్టరేట్' (ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చర్చ్ మేనేజ్‌మెంట్) పొందారు. అనేక ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు అందుకున్నారు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఆయన రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 2005లో డీఎండీకే పార్టీని స్థాపించారు. 2006, 2011 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు. 2016 ఎన్నికల్లో పరాజయం పొందారు.

సీఎం స్టాలిన్ నివాళి

చెన్నై: డీఎండీకే అధ్యక్షుడు విజయకాంత్ భౌతికకాయానికి తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ నివాళులర్పించారు. చెన్నైలోని ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వ లాంఛనాలతో విజయకాంత్ అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. విజయకాంత్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ సోషల్ మీడియాలో ఓ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. 'నా మిత్రుడు, డీఎండీకే అధ్యక్షుడు కెప్టెన్ విజయకాంత్ మృతి బాధాకరం. మంచి మనసున్న వ్యక్తి. సినీ పరిశ్రమలోనూ, ప్రజా జీవితంలోనూ కఠోర శ్రమతో పనులు పూర్తి చేసేవారు. నటుడిగా, నటీనటుల సంఘం అధ్యక్షుడిగా, రాజకీయ నాయకుడిగా, శాసన సభ్యుడిగా, ప్రతిపక్షనేతగా.. ఇలా అన్ని విషయాల్లోనూ అంకితభావంతో పనిచేశారు. తన చుట్టూ ఉండే వారిని ఆదరించేవారు. నాకు, నా కుటుంబానికి మంచి స్నేహితుడు. నటీనటుల సంఘం అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఎన్నో వేడుకలను సమర్థంగా నిర్వహించారు. చిత్రపరిశ్రమ ఆయనను ఎన్నో సత్కారాలతో గౌరవించింది. ఎవరికి ఆరోగ్యం బాగాలేకపోయినా స్వయంగా వచ్చి పరామర్శించేవారు. ఉదారహృదయం కలిగిన మహానుభావుడు. ఆయనతో గడిపిన క్షణాలు నా హృదయంలో ఎప్పటికీ నిలిచిపోతాయి' అని నివాళి అర్పించారు.

ఏపీ భూ హక్కుల చట్టం రద్దు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

గుర్తుచేశారు. ప్రజల స్థిరాస్తుల విషయంలో వివాదాలు ఏర్పడినప్పుడు...ఆ వివాదాలు పరిష్కరించే అధికారాలను సివిల్ కోర్టుల పరిధి నుండి తప్పించి... ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న జిల్లాస్థాయి రెవెన్యూ ట్రిబ్యునళ్లకు కట్టబెడుతూ... ట్రిబ్యునల్ ఉత్తర్వులపై నేరుగా హైకోర్టులో మాత్రమే అప్పీలు చేసుకునే అధికారం ఉందని పేర్కొనడం దుర్మార్గమని రామకృష్ణ విమర్శించారు. ఇప్పటికే భూ సమగ్ర సర్వే పేరుతో రాష్ట్రంలో జరుగుతున్న సర్వేలో అనేక అవకతవకలు, లోపాలు వెలుగుచూడడంతో స్థిరాస్తిదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. సర్వే సందర్భంగా ఉత్పన్నమవుతున్న సమస్యలను పరిష్కరించడంలో రెవెన్యూ యంత్రాంగం పూర్తిగా విఫలమైందన్నారు. రెవెన్యూ వ్యవస్థలోని లోపాలు, అవినీతి వల్ల అధికంగా భూ సమస్యలు తలెత్తుతున్నాయనేది జగమెరిగిన సత్యమని పేర్కొన్నారు. అలాంటప్పుడు ఆయా భూ సమస్యలు పరిష్కరించే బాధ్యతను తిరిగి ఆ రెవెన్యూ వ్యవస్థకు అప్పగించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఇప్పటికే అవినీతిలో కూరుకుపోయిన రెవెన్యూ యంత్రాంగానికి ఈ చట్టం వరంగా, వాస్తవ హక్కుదారులకు శాపంగా పరిణమిస్తుందనడంలో సందేహం లేదన్నారు. మరోపక్క ప్రభుత్వ పెద్దల జోక్యం పెరిగి వాస్తవ భూ యజమానులకు అన్యాయం జరిగే ప్రమాదముందని హెచ్చరించారు. ఈ చట్టం అమల్లోకి వస్తే ఇప్పటివరకు భూములకు ఉన్న పట్టాదారు పాసుపుస్తకం, టైటిల్ డీడ్, అడంగల్, 1బీ లాంటి రికార్డులు రద్దవుతాయని, తద్వారా చిన్న, సన్నకారు రైతులు, దళిత, గిరిజన రైతుల భూములు కబ్జాకు గురయ్యే ప్రమాదం ఉందని వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వం నియమించే ల్యాండ్ టైట్లింగ్ అధికారి నమోదు చేసే హక్కుల రిజిస్టర్‌లో భూహక్కుదారుడి పేరు తప్పుగా నమోదైతే అభ్యంతరం తెలపాలంటే జిల్లా కలెక్టర్ నియంత్రణలో జిల్లాస్థాయిలో ఏర్పాటయ్యే రెవెన్యూ ట్రిబ్యునల్‌కు వెళ్లి పరిష్కరించుకోవాలే తప్ప సివిల్ కోర్టులను ఆశ్రయించే అవకాశం లేదని రామకృష్ణ తెలిపారు. దీంతో స్థిరాస్తిదారులు అధిక వ్యయ ప్రయాసలకు గురై...సత్వర న్యాయం పొందే అవకాశం కూడా ఉండదన్నారు. ఆన్‌లైన్ నమోదులో భూమి హక్కు తప్పుగా నమోదైన పక్షంలో ఆ భూ యజమాని రెండేళ్లలోపు ట్రిబ్యునల్‌లో కేసు దాఖలుచేసి తనదని నిరుపించుకోకపోతే శాశ్వతంగా భూమి కోల్పోయే ప్రమాదం ఈ చట్టం వల్ల ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. అధికార పార్టీ నాయకుల సిఫార్సులతో రెవెన్యూ ట్రిబ్యునల్ వ్యవస్థ తీర్పులిచ్చే పరిస్థితులు స్థిరాస్తిదారులకు గొడ్డలిపెట్టుగా మారతాయని చెప్పారు. ప్రభుత్వ భూములు తమ అనుకూల కార్పొరేట్ సంస్థలకు, రియల్ ఎస్టేట్, భూ కబ్జాదారుల వశమవుతాయని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న 535 సివిల్ కోర్టులలోనే ఏళ్ల తరబడి మగ్గుతున్న భూ వివాదాలు, కేవలం 26 రెవెన్యూ ట్రిబ్యునళ్లతో పరిష్కరించడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. వైసీపీ నేతల స్వప్రయోజనాల కోసమే ఈ దుష్టచట్టం తీసుకొచ్చారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి చెప్పారు. అసలైన భూ హక్కుదారులకు అన్యాయం జరిగేలా రూపొందించిన ఆంధ్రప్రదేశ్ భూ హక్కుల చట్టం (ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 27/2023)ను రద్దు చేయాలని కోరారు. వాస్తవ భూ హక్కుదారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం 'సమగ్ర భూ హక్కుల పరిరక్షణ చట్టం' రూపొందించేందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అన్ని రాజకీయ పార్టీలు, న్యాయ నిపుణులు, రైతుసంఘాల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

జర్నలిస్టుల ఫోన్లలో పెగాసస్

(మొదటిపేజీ తరువాయి)

పోస్ట్‌కు వివరించారు. వరదరాజన్ ఫోన్‌కు అక్టోబర్ 16న వైరస్ సోకినట్లు తెలిపింది. ప్రభుత్వ ప్రోద్బలంతో దాడులు (స్టేట్ స్పాన్సర్డ్ ఎటాక్స్) జరగవచ్చంటూ ఈ ఏడాది అక్టోబర్‌లో ప్రతిపక్ష ఎంపీలు సహా కొంతమంది జర్నలిస్టులకు యాపిల్ సంస్థ వార్నింగ్ అలర్ట్‌లు పంపిన సంగతి తెలిసిందే. ఈ హెచ్చరికను అందుకున్న అనంతరం వారు తమ ఫోన్‌లను పరీక్షించాల్సిందిగా ఆమ్నెస్టీకి అందించినట్లు పేర్కొంది. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్‌కి చెందిన సెక్యూరిటీ ల్యాబ్ పరీక్షల్లో వారి ఫోన్‌లు పెగాసెస్ స్పైవేర్‌తో హ్యాక్ చేసినట్లు తేలిందని స్పష్టం చేసింది. వాస్తవాలను వెలికితీస్తున్న జర్నలిస్టులను మాత్రమే లక్ష్యంగా చేసుకోవడం వారి గోప్యతపై చట్టవిరుద్ధమైన దాడితో సమానం, భావప్రకటనా స్వేచ్ఛ హక్కుని ఉల్లంఘించడమేనని స్పష్టం చేసింది. భారత్ సహా అన్ని దేశాలు చట్టవిరుద్ధమైన నిఘా నుండి ప్రజలను రక్షించడం ద్వారా మానవ హక్కులను సంరక్షించాల్సిన బాధ్యతను కలిగి ఉన్నాయని స్పైవేర్స్‌ను గుర్తించే సెక్యూరిటీ ల్యాబ్ అధిపతి డోన్చా ఓ సియరాబెల్ చెప్పారు. సెప్టెంబర్ 2021లో సిటిజన్ ల్యాబ్ గుర్తించిన విధంగా జర్నలిస్టుల నుండి సేకరించిన నమూనాలు ఎన్‌ఎస్‌ఓ గ్రూప్ బ్లాస్ట్‌పాస్ (బీఎల్‌ఏఎస్‌టీపీఏఎస్‌ఎస్), ఐఓఎస్ 16.6.1 (సీవీఈ -2023-41064) నిఘాకు అనుగుణంగా ఉన్నాయని పేర్కొన్నారు. పెగాసెస్ స్పైవేర్‌ను అభివృద్ధి చేసిన ఎన్‌ఎస్‌ఓ గ్రూప్ దాని సాంకేతికతను ప్రభుత్వాలకు మాత్రమే విక్రయిస్తుంది. భారత్ ఇంటెలిజెన్స్ బ్యూరో 2017లో ఎన్‌ఎస్‌ఓ నుండి ఈ హార్డ్‌వేర్‌ను దిగుమతి చేసుకున్నట్లు నివేదికలు పేర్కొన్నాయి. అక్టోబర్‌లో భద్రతా హెచ్చరికలు వచ్చిన తర్వాత ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులకు ఈ హెచ్చరికలు ఎందుకు వచ్చాయనే దానిపై ప్రజలకు తప్పుడు వివరణలు అందించేలా బీజేపీ ప్రభుత్వం యాపిల్ సంస్థపై ఒత్తిడి తీసుకు వచ్చిందని వాషింగ్టన్ పోస్ట్ ప్రత్యేకంగా నివేదించింది. ఈ అలర్ట్ మెసేజ్‌లు 150 దేశాల్లోని ప్రజలకు వెళ్లాయని కేంద్ర మంత్రులు, యాపిల్ సంస్థ తప్పుదోవ పట్టించే, నిరాధారమైన ప్రకటనలు చేసినట్లు తెలిపింది. అయితే ఇతర దేశాల ప్రజలు, అధికార పార్టీ చట్టసభ సభ్యులు ఆ వారంలో యాపిల్ సంస్థ నుండి హెచ్చరికలు స్వీకరించలేదని పేర్కొన్నారు. భారత్‌లోని చాలామంది ప్రతిపక్షనేతలు, జర్నలిస్టులు, కార్యకర్తలను పెగాసెస్ 2021 వరకు లక్ష్యంగా చేసుకుందని స్పైవేర్ ప్రపంచ వ్యాప్త లక్ష్యాల గురించి నివేదించిన ఫర్బిడెన్ స్టోరీస్ కలెక్టివ్ వెల్లడించింది.

ప్రియాంకకు ఈడీ షాక్

(మొదటిపేజీ తరువాయి)

వ్యాపారవేత్త సీసీ థంపి, మధ్యవర్తి సంజయ్ భండారీ బంధువు సుమిత్ చద్దాపై ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఛార్జిషీట్‌లో రాబర్ట్ వాద్రా, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీని నిందితులుగా పేర్కొనకపోయినప్పటికీ, కోర్టులో దాఖలు చేసిన చార్జిషీట్‌లో ప్రియాంక గాంధీ పేరు రావడం ఇదే తొలిసారి. దిల్లీలోని ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్‌ఏ) ప్రత్యేక కోర్టు డిసెంబర్ 22న ఈ ఛార్జ్ షీట్‌ను పరిగణనలోకి తీసుకుంది. తదుపరి విచారణను జనవరి 29, 2024కు జాబితా చేసింది. భండారీ 2016లో బ్రిటన్ పారిపోయారు. అయితే ఈడీ, సీబీఐ చేసిన అభ్యర్థన మేరకు ఈ ఏడాది జనవరిలో అతనిని భారతదేశానికి అప్పగించేందుకు బ్రిటిష్ ప్రభుత్వం అంగీకరించింది. దిల్లీకి చెందిన రియల్ ఎస్టేట్ సంస్థ ద్వారా హరియాణాలో వ్యవసాయ భూమి కొనుగోలు చేసిన వాద్రా తర్వాత సంజయ్ భండారీ మిత్రుడు ఎన్‌ఆర్‌ఐ, వ్యాపారవేత్త సీసీ థంపికి విక్రయించినట్లు ఈడీ ఛార్జ్‌షీట్‌లో తెలిపింది. 2006లో ఫరీదాబాద్‌లో ఆ వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి, 2010లో ఆ భూమిని అదే ఏజెంట్‌కు విక్రయించడంలో ప్రియాంక ప్రమేయం ఉందని ఈడీ తన అభియోగాల్లో పేర్కొంది. ఆ ఏజెంట్ కొంత భాగాన్ని థంపికి కూడా విక్రయించాడని ఛార్జ్‌షీట్‌లో వెల్లడించింది. ఆ లావాదేవీలు వాద్రా, థంపి మధ్య భాగస్వామ్య సంబంధాలు, పరస్పర వ్యాపార ప్రయోజనాలను వెల్లడి చేస్తున్నాయని తన అభియోగాల్లో వివరించింది. భండారీ తన అక్రమ ఆర్జనతో లండన్‌లో దక్కించుకున్న 12 బ్రియాన్‌స్టోన్ స్క్వేర్ అనే ఇంటికి రాబర్ట్ వాద్రా మరమ్మతులు చేయించారని, అందులో నివాసం కూడా ఉన్నారని ఈడీ ఆరోపించింది. బ్రిటన్‌కు చెందిన సుమిత్ చడా అనే వ్యక్తి, వాద్రాకు ఈ వ్యవహారంలో సహకరించారని చెప్పింది. ఈ కేసులో నిందితుడైన భండారీ 2016లోనే బ్రిటన్‌కు పారిపోయారు. ఆయన్ను వెనక్కి తీసుకొచ్చేందుకు ఈడీ, సీబీఐ చేసిన వినతికి బ్రిటన్ ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో ఆమోదం తెలిపింది.

రేపు మంత్రుల కార్యాలయాల వద్ద

అంగన్‌వాడీల ధర్నాలు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): కనీస వేతనాలు, గ్రాట్యుటీ, ఇతర సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్‌వాడీలు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సమ్మె ఉధృతంగా జరుగుతున్న సంగతి విదితమే. తక్షణమే తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 30వ తేదీ శనివారం మంత్రుల కార్యాలయాల వద్ద ధర్నాలు చేస్తామని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ & హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయుసీ అనుబంధం) ప్రధాన కార్యదర్శి జే లలితమ్మ, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ & హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి కే సుబ్బరావమ్మ, ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ & హెల్పర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) నేతలు తెలిపారు. గురువారం గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం,మంత్రులు అంగన్‌వాడీ అక్క చెల్లెమ్మలకు అవాస్తవాలు చెప్పడం మానుకోవాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వస్తే తెలంగాణలో ఇచ్చే వేతనం కన్నా రూ.వెయ్యి అదనంగా పెంచుతామని హామీ ఇచ్చి ఇప్పటివరకు పెంచలేదన్నారు.అనేక ఉద్యమాల తరువాత అంగన్‌వాడీ వర్కర్లకు వేతనం రూ. 10,500 నుండి రూ.11,500లకు, వెల్ఫేర్ మినీ వర్కర్లకు రూ.6వేల నుంచి రూ.7వేలకు పెంచారన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయని, దానికి అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, డిమాండ్ చేశారు.అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు ఆపేశారని, వీరికి కూడా వితంతు, వికలాంగులకు మాదిరిగా పెన్షన్ ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్లకు వెల్ఫేర్ ప్రోత్సాహకం రూ. 500/- చొప్పున 20% మందికి మాత్రమే ఇస్తున్నారని, ఇది అందరికీ ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్ నిర్వహణకు ఇచ్చే సెల్ ఫోన్, చీరలు, సెంటర్ అద్దెలు, టీఏ బిల్లులు అంగన్‌వాడీలకే ఇచ్చినట్లు ప్రచారం చేస్తున్నారని... అవి నిర్వహణకు మాత్రమేనని, దానివలన వారికి ఒరిగిందేమీ లేదని తెలిపారు. అంతేకాకుండా యాప్ ద్వారా పని భారం పెరిగిందన్నారు. అంగన్‌వాడీలకు బీమా అమలు కావటం లేదని, అమలు చేస్తున్నామని అవాస్తవాలు చెబుతున్నారన్నారు. చనిపోయిన వారికి కనీసం మట్టి ఖర్చులు కూడా ఇవ్వటం లేదన్నారు. విధుల్లో ఉంటూ మృతి చెందిన వారి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ఇంటిలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేతనాలు పెంచాలని, గ్రాట్యూటీ ఇవ్వాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, వేతనంతో కూడిన మెడికల్ బిల్ ఇవ్వాలని, లబ్ధిదారులకు మెస్ చార్జీలు ఇవ్వాలన్న డిమాండ్లతో ఈనెల 30న మంత్రుల కార్యాలయాల దగ్గర ధర్నాలు చేస్తామని వివరించారు.

నిజ్జర్ హత్య కేసులో ఇద్దరి అరెస్టుకు రంగం సిద్ధం

ఒట్టావా: ఖలిస్తానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసులో ఇద్దరిని కెనడా పోలీసులు అరెస్టు చేయనున్నారు. నిందితులు ప్రస్తుతం పోలీసుల నిఘాలో ఉన్నారని సమాచారం. నిజ్జర్ హత్య తర్వాత హంతకులు కెనడాను విడిచిపెట్ట లేదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. నెలల తరబడి పోలీసుల నిఘాలో ఉన్నారని తెలుస్తోంది. కెనడా సర్రేలోని గురుద్వారాలో ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్‌ను ఈ ఏడాది జులై 18న గుర్తు తెలియని దుండగులు కాల్చి చంపారు. ఈ హత్యలో భారత దౌత్యవేత్తల ప్రమేయం ఉందని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఆ దేశ పార్లమెంట్‌లో ఆరోపించారు. ఇది కాస్త భారత్-కెనడా వివాదంగా మారిపోయింది. ట్రూడో ఆరోపణలను భారత్ ఖండించింది. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదని తెలిపింది. నిజ్జర్ హత్య కేసులో దర్యాప్తునకు భారత్ బాధ్యత వహించాలని కెనడా డిమాండ్ చేసింది. ప్రపంచ దేశాల నుంచి భారత్‌పై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేసింది. రెండు దేశాలు వీసాలపై నిబంధనలు విధించుకునే స్థాయికి వెళ్లాయి. ఇటీవలే కెనడా వీసాల రద్దును భారత్ సడలించింది.

ఆగని కసరత్తు

(మొదటిపేజీ తరువాయి)

వైసీపీ శ్రేణులకు మింగుడు పడటం లేదు. తాజాగా గుంటూరు జిల్లాలోని గురజాలలో వైసీపీ నేతల మధ్య గ్రూపు విభేదాలు నెలకొన్నాయి. తనకు సీటు కేటాయించాలని ఎమ్మెల్సీ, బీసీ నేత జంగా కృష్ణమూర్తి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అదిష్ఠానం పిలుపుతో ఆయన భేటీ రద్దు చేసుకున్నారు. గురజాల సిట్టింగ్ ఎమ్మెల్యేగా కాసు మహేశ్ రెడ్డి ఉన్నారు. ఎమ్మెల్సీ జంగాకు సీఎం కార్యాలయం నుంచి పిలుపు రావడంతో ఆయన శుక్రవారం జగన్ కలిసే అవకాశముంది. పి.గన్నవరం నియోజకవర్గంలో వైసీపీ టికెట్ వ్యవహారంపై ఇంకా అసంతృప్తి చల్లారలేదు. ఇప్పటికే ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబుకు అధిష్ఠానం టికెట్ నిరాకరించింది. దీంతో చిట్టిబాబు అనుకూల, వ్యతిరేక వర్గాలుగా నాయకులు, కార్యకర్తలు చీలిపోయారు. పెనుగొండలోనూ ఎమ్మెల్యే శంకర్ నారాయణ వర్గం నిరసనకు దిగింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన వైసీపీ నేతలు కూడా జగన్‌ను కలిశారు. ఎమ్మిగనూరు టికెట్ బీసీలకు ఇవ్వాలని వైసీపీ నిర్ణయించడంతో స్థానిక ఎమ్మెల్యే కేశవరెడ్డి, మాజీ ఎంపీ బుట్టా రేణుక తదితరులు తాడేపల్లి వచ్చారు. కాగా, ఈ విడత మంత్రి పెద్దిరెడ్డిని ఎంపీకి పంపి, ఆయన తనయుడు మిథున్ రెడ్డిని ఎమ్మెల్యేగా పోటీ చేయాలని సీఎం సూచిస్తున్నట్లు తెలిసింది. రాయలసీమ జిల్లాలకు చెందిన కొంతమంది ఎమ్మెల్యేలను క్యాంపు కార్యాలయానికి పిలిపించారు. వచ్చే ఎన్నికల్లో ఇన్‌చార్జిల మార్పుగాని లేదా టికెట్లు రాబోవని సమాచారం తెలిపే జాబితాలో ఉన్న ఎమ్మెల్యేలను తాడేపల్లి క్యాంప్ కార్యాలయానికి పిలుస్తున్నారు. కాగా, మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నాని, హిందూపురం ఎంపీ గోరంట మ మాధవ్ కూడా సీఎం జగన్‌ను కలిశారు.

మహిళలను దుర్భాషలాడతారా?

- వినుకొండ ఎమ్మెల్యే తీరుపై ముప్పాళ్ల ఆగ్రహం
- అంగన్‌వాడీల సమ్మెకు అఖిలపక్ష నాయకుల సంఘీభావం
- ఎమ్మెల్యే బ్రహ్మానాయుడిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

విశాలాంధ్ర-వినుకొండ: అంగన్‌వాడీలపై వినుకొండ ఎమ్మెల్యే బ్రహ్మానాయుడు దురుసుగా ప్రవర్తించడం, దుర్భాష లాడడాన్ని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. ఒక శాసనసభ్యుడిగా అంగన్‌వాడీల సమస్యలపై వినతి పత్రం తీసుకోవలసింది పోయి మహిళల పట్ల ఇంత అమానుషంగా ప్రవర్తించడాన్ని తప్పుబట్టారు. ఇది అత్యంత గర్హించదగ్గ విషయమన్నారు. గురువారం అంగన్‌వాడీల సమ్మె శిబిరం వద్ద జరిగిన అఖిలపక్ష సమావేశంలో ముప్పాళ్ల మాట్లాడారు. స్వయానా ఎమ్మెల్యే అంగన్‌వాడీలను, అక్కడ ఉన్న ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులను దుర్భాషలాడి పోలీసులతో, తన పార్టీ కార్యకర్తలతో మహిళలను భయభ్రాంతులకు గురి చేయటాన్ని ముప్పాళ్ల తీవ్రంగా నిరసించారు. ఎమ్మెల్యే కి వినతి పత్రం ఇవ్వడానికి ఇంటి వద్ద కు వెళ్లినపుడు ఆ వినతి పత్రాన్ని తీసుకుని... ఆ విషయాలను ముఖ్యమంత్రి కి తెలియజేస్తానని అంగన్‌వాడీ మహిళలకు చెప్పి ఉంటే ఇంత గొడవ జరిగేది కాదని ఆయన అన్నారు. నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే... తన పార్టీ కార్యకర్తలను రెచ్చగొడుతూ ప్రజా సంఘాల నాయకులను దుర్భాషలాడటం తగదన్నారు. ఎమ్మెల్యే తీరు మార్చుకోవాలని, నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని మరో మూడు నెలలు మాత్రమే అధికారంలో ఉండే ప్రజాప్రతినిధికి అంత అహంకారం పనికిరాదని హితవు పలికారు. అఖిల పక్ష సమావేశం జరుగుతుండగా తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు సమావేశంలో ఉన్న టీడీపీ నాయకులు షమీంఖాన్‌కు ఫోన్ చేసి అఖిలపక్ష సమావేశంలో తీసుకునే నిర్ణయాలను తెలుగుదేశం పార్టీ సంపూర్ణంగా బలపరుస్తుందని తెలిపారు. స్థానిక శాసనసభ్యుడు అంగన్‌వాడీలు, పట్ల వామపక్ష నాయకుల పట్ల వ్యవహరించిన తీరును, నోటి దురుసుతనాన్ని తీవ్రంగా ఖండించారు. అంగన్‌వాడీల సమ్మెకు సంపూర్ణ మద్దతును తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న అఖిలపక్ష నాయకులు తర ఇంటి వద్ద అంగన్‌వాడీలపై ఎమ్మెల్యే ప్రవర్తించిన తీరుపై తీవ్ర నిరసన తెలిపారు. తమకు మద్దతు తెలియజేసిన అఖిలపక్ష నాయకులకు అంగన్‌వాడీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు షమీంఖాన్, పెమ్మ సాని నాగేశ్వరరావు, జనసేన నేతలు నిశంకర శ్రీనివాసరావు, ఉషారాణి, కాంగ్రెస్ నేతలు అట్లూరి విజయకుమార్, ఆర్కే నాయుడు, సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, సీఐటీయూ నాయకుడు కే హనుమంత్ రెడ్డి, రైతు సంఘం నేత గోపాలరావు, న్యాయవాది సీహెచ్ఎల్ఎన్ మూర్తి, న్యాయవాది రామకోటేశ్వరరావు, గోనుగుంట్ల హనుమంతరావు, సంద్రపాటి సైదా, బూదాల శ్రీనివాసరావు, ఉలవలపూడి రాము, మేడం రమేష్, ఎంఐఎం నాయకులు షేక్ బాజీ, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు చిదంబరం, ఫిరోజ్, ఎమ్మార్పీఎస్ నాయకులు చిన్న తదితరులు పాల్గొని అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు తెలియజేస్తూ మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఒంటెద్దు పోకడ దురుసు ప్రవర్తనను పాల్గొన్న నాయకులు తీవ్రంగా ఖండించారు. ఆడవారిని దూషించిన వారిని ఎవరు సమర్థించరని గత 40 సంవత్సరాల్లో ఏ శాసన సభ్యులు ఇలా దురుసుగా ప్రవర్తించలేదని, ఇలాంటి వారిని గద్దె దించే వరకు పోరాడతామని తెలిపారు. గురువారం అంగన్‌వాడీలు పోస్టుకార్డులపై తమ డిమాండ్లను రాసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు పోస్టు చేశారు. కార్యక్రమంలో దీక్షా శిబిరానికి నాయకత్వం వహిస్తున్న ఎల్ ప్రసన్నకుమారి, ఎం.శారమ్మ అంగన్‌వాడీ సెక్టార్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.అనంతరం మారుతి వరప్రసాద్ హనుమంత రెడ్డిల పై అనుచిత వ్యాఖ్యలు చేసిన శాసనసభ్యుడు బ్రహ్మానాయుడు పై కేసు నమోదు చేయాలని వినుకొండ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

మేనిఫెస్టోపై చర్చకు టీడీపీ సిద్ధమా: మంత్రి జోగి రమేశ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మేనిఫెస్టో అంటే టీడీపీకి ఒక పనికిరాని చెత్తకాగితమని, మేనిఫెస్టోపై చర్చించే దమ్ము టీడీపీకి ఉందా? అని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేశ్ సూటిగా ప్రశ్నించారు. టీడీపీ దివాలా తీసిందన్న విషయం అందరికీ తెలుసని, చంద్రబాబుకు ఒంటరిగా పోటీ చేసే దమ్ము లేదన్నారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. జోగి రమేశ్ మాట్లాడుతూ... పొత్తుల పేరుతో చంద్రబాబు అందరి చుట్టూ తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. అసలు చంద్రబాబుకు ఏపీతో ఏం పని అనీ, ఈ రాష్ట్రంలో ఆధార్ కార్డు ఉందా?, డోర్ నంబరు ఉందా?, ఇలాంటి చిరునామా లేని వ్యక్తులు మా పార్టీ గురించి మాట్లాడటానికి సిగ్గుపడాలన్నారు. రైతులు, డ్వాక్రా మహిళలను రుణమాఫీ పేరుతో దారుణంగా చంద్రబాబు మోసగించారని, నిరుద్యోగ భృతి పేరుతో యువతను మోసగించారని ఆరోపించారు. రాష్ట్రంలో 30లక్షల మందికి ఇళ్లు నిర్మిస్తున్న జగన్ లాంటి సీఎం దేశంలో ఎక్కడైనా ఉన్నారా? అని ప్రశ్నించారు. చంద్రబాబు తరహాగా తాము మేనిఫెస్టోని వెబ్ సైట్ నుంచి తాము తొలగించలేదని గుర్తుచేశారు. 2014లో మేనిఫెస్టోని అమలు చేయనందునే చంద్రబాబును ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించారన్నారు. మేనిఫెస్టోలో 99.5శాతం హామీలను అమలు చేసిన నేత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని, వాటిని తాము నిరూపిస్తామని స్పష్టంచేశారు. అందుకే తాము ఇంటింటికీ ధైర్యంగా చెప్పగలుగుతున్నామన్నారు. టీడీపీ 2014 మేనిఫెస్టోపైన, వైసీపీ 2019 మేనిఫెస్టోపైన చర్చకు రాగలారా? అని సవాల్ విసిరారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు వైసీపీ మేనిఫెస్టో అమలులో విఫలమైందని ఆరోపించడం సిగ్గుచేటని మండిపడ్డారు. మహిళలకు తాము ఉచిత ప్రయాణంపై తాము ఎలాంటి ప్రకటన చేయకపోయినా మాపై ఆరోపణలు చేస్తున్నారన్నారు.

వైద్యపరిశోధన కోసం
మైనేని జయప్రద భౌతికకాయం

విశాలాంధ్ర-విజయవాడ: కమ్యూనిస్టు పార్టీ కుటుంబానికిచెందిన మైనేని జయప్రద భౌతికకాయాన్ని వైద్య పరిశోధన కోసం అప్పగించారు. ఆమె జీవితాంతం పాఠశాలలో విద్యార్థులకు సైన్స్ పాఠాలు బోధించి మరణానంతరం తన భౌతికకాయాన్ని కాల్చి బూడిద అవ్వకుండా వైద్య విద్యార్థులకు ఉపయోగపడాలని ఆమె భావించారు. మరణానంతరం జరిగే కార్యక్రమం కోసం ఆ మేరకు ధృవపత్రాలు సిద్ధం చేసుకున్నారు. స్థానిక అశోక్ నగర్ ప్రాంతానికి చెందిన విశ్రాంత సైన్స్ అధ్యాపకులు మైనేని జయప్రద(91) బుధవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. జయప్రద ఉమ్మడి కృష్ణాజిల్లాలో జిల్లా పరిషత్ పాఠశాలలో పటమట, పెనమలూరు,ఈడ్పుగల్లు ప్రాంతాల్లో సైన్స్ అధ్యాపకులుగా పనిచేశారు. ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త మైనేని లక్ష్మణస్వామి సీపీఐ కృష్ణాజిల్లా కార్యదర్శిగా, కంకిపాడు నియోజక వర్గానికి సీపీఐ నుండి రెండు సార్లు శాసనసభ సభ్యులుగా ఎన్నికయ్యారు. అయన 1985లోనే మరణించారు. వారి కుటుంబ సభ్యులు తొలి నుండి వామపక్ష ఉద్యమంలో అంకితమై ఉన్నారు. జయప్రద ఉద్యోగ విరమణ తర్వాత హైదరాబాదులో కుమారుని వద్ద స్థిరపడ్డారు. కొంతకాలంగా వృద్ధాప్య సమస్యతో ఆమె బాధపడుతున్నారు. విజయవాడలో అక్క ఇంటి వద్ద ఉంటూ చికిత్స తీసుకుంటున్నారు. ఆమె ముందస్తు కోరిక మేరకు నేత్ర శరీర దాన ప్రోత్సాహకులు మోతుకూరి అరుణకుమార్ సహకారంతో మరణానంతరం నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ నేత్రనిధికి, భౌతికకాయాన్ని వైద్యవిద్యార్థుల పరిశోధన కోసం మంగళగిరిలోని ఎన్ఆర్ఐ వైద్య కళాశాలకు అప్పగించారు. ఆమె మరణం పట్ల కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి కె.నారాయణ సంతాపం తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్, జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, స్థానిక కార్పొరేటర్ పొట్లూరి సాయి బాబు, సీపీఐ జిల్లా నాయకులు నార్ల వెంకటేశ్వరరావు, వెలగపూడి ఆజాద్, టి తాతయ్య, లంక దుర్గారావు, మోతుకూరి వెంకటేశ్వరరావు, అక్కినేని చంద్రరావు, అడ్డాడ ప్రసాద్, పరుచూరి అజయ్ కుమార్, అరుణకుమార్, నరసింహారావు, సూరిబాబు, పోతురాజు నాగేశ్వరరావు తదితరులు నివాళులు అర్పించారు. మైనేని కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

మోదీ, జగన్ సర్కార్లకు గుణపాఠం తప్పదు

సీపీఐ వర్క్‌షాప్‌లో ఈశ్వరయ్య హెచ్చరిక

విశాలాంధ్ర-మైదుకూరు: ఇచ్చిన హామీలు అమలు చేయని మోదీ, జగన్ సర్కార్లను ఇంటికి పంపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని వర్గాలను విస్మరించాయని, పాలకులపై తిరుగుబాటుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టంచేశారు. కడప జిల్లా సమగ్రాభివృద్ధి కోసం గురువారం స్థానిక డీసీయల్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సీపీఐ జిల్లాస్థాయి వర్క్‌షాప్‌లో ఈశ్వరయ్య మాట్లాడారు. విశాలమైన రేగడి నేలలు, అపారమైన ఖనిజ సంపద, సమృద్ధిగా మానవవనరులు గల కడప జిల్లాలో కరువు, వలసలు, ఆత్మహత్యలు నిత్యకృత్యమయ్యాయని ఈశ్వరయ్య చెప్పారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పన, కడప ఉక్కుపరిశ్రమ, మూతపడ్డ పరిశ్రమల పునరుద్ధరణ, ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వాలపై దశల వారీ పోరాటాలకు ఈ వర్క్‌షాప్ వేదిక కావాలన్నారు. నల్లధనం వెలికితీత, పన్నుల భారం తగ్గింపు, ధరల నియంత్రణ, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు వంటి హామీలను మోదీ సర్కారు నెరవేర్చలేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను తన కార్పొరేట్ మిత్రులకు కారుచౌకగా తెగనమ్ముతోందని విమర్శించారు. ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించడం ద్వారా రాజకీయ లబ్ది పొందుతోందన్నారు. విభజన హామీలను పూర్తిగా విస్మరించిందన్నారు. దర్యాప్తు సంస్థలను జేబు సంస్థలుగా వాడుకుంటోందని మండిపడ్డారు. ఇక జగన్ సర్కార్ కేంద్రంతో అంటకాగుతూ రాష్ట్ర ప్రయోజనాలు మంటగలుపుతోందని ఈశ్వరయ్య విమర్శించారు. నగదు బదిలీ పథకం పేరుతో బటన్ నొక్కి ఇదే సంక్షేమం, అభివృద్ధి అంటూ సీఎం జగన్ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ లోపభూయిష్ట విధానాలతో విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారన్నారు. దళితులు, మహిళలకు, మైనారిటీలకు రక్షణ కరువైందన్నారు. నాటి సీఎం వైయస్ రాజశేఖరరెడ్డి తలపెట్టిన ఉక్కుఫ్యాక్టరీ, ప్రాజక్టులు, రోడ్లు, రైల్వే, విద్యా, వైద్యం వంటి పనులు ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారిందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏపీఐఐసీ పేరుతో సేకరించిన భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించిన దాఖలాలు కనిపించడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.రామయ్య, ఎల్.నాగసుబ్బారెడ్డి, యంవీ సుబ్బారెడ్డి, బషీరున్నీసా, ఎస్.వెంకట శివ, పి.చంద్రశేఖర్, వీరశేఖర్, విజయలక్ష్మి, జి.వేణుగోపాల్, కేసీ బాదుల్లా, పి.శ్రీరాములు, ఏవీ శివరాం, పి.భాస్కర్, నాగేశ్వరరావు, దస్తగిరి, వలరాజు, పల్లవోలు రమణ, పీరయ్య, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో చేరిన అంబటి రాయుడు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మాజీ క్రికెటర్ అంబటి రాయుడు వైసీపీలో చేరారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో అంబటి రాయుడుకు సీఎం జగన్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఇటీవల నుంచి అంబటి రాయుడు వైసీపీ తరపున అనేక నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారు. ఆయనకు గుంటూరు ఎంపీ టికెట్ ఇస్తారని కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. అందులో భాగంగా గుంటూరు పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆయన పర్యటించారు. తాజాగా సీఎం జగన్‌ను ఆయన కలసి పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మిథున్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి పాల్గొన్నారు.

జగన్ సర్కారుకు హైకోర్టులో చుక్కెదురు

విశాఖకు కార్యాలయాల తరలింపుపై లంచ్‌మోషన్ తిరస్కరణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: జగన్ సర్కారుకు హైకోర్టులో చుక్కెదురు అయింది. విశాఖకు కార్యాలయాల తరలింపు నకు సంబంధించి ప్రభుత్వం దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం తిరస్కరించింది. ఈ అంశంపై మంగళవారం విచారణ జరుపుతామని తెలిపింది. సీఎం క్యాంపు కార్యాలయం ముసుగులో ప్రభుత్వ కార్యాలయాలను అమరావతి నుంచి విశాఖకు తరలిస్తున్నారని రాజధాని రైతులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యాలను త్రిసభ్య ధర్మాసనం ముందుకు పంపుతూ ఇటీవల హైకోర్టు సింగిల్ జడ్జి ఆదేశాలిచ్చారు. త్రిసభ్య ధర్మాసనం తగిన ఉత్తర్వులు ఇచ్చేంత వరకు కార్యాలయాల తరలింపునకు చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. అయితే కార్యాలయాల తరలింపు అంశంపై అత్యవసరంగా విచారణ చేపట్టాలని ప్రభుత్వం గురువారం లంచ్‌మోషన్ పిటిషన్ వేసింది. దీనిని తిరస్కరించిన న్యాయస్థానం.. మంగళవారం విచారణ జరుపుతామని తెలిపింది.

పేదల సంక్షేమమే లక్ష్యం

విశాఖ వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రారంభంలో గవర్నర్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: పేదలకు సంక్షేమ ఫలాలు అందాలనే ఉద్దేశంతో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జరుగుతోందని, ఇందులో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ సూచించారు. ఆయన గురువారం విశాఖ వేదికగా యాత్రను ప్రారంభించారు. అనంతరం స్థానిక ఏయూ కన్వెన్షన్ హాలులో నిర్వహించిన ప్రత్యేక సభలో ప్రసంగిస్తూ కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. వివిధ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించటం, అవకాశాలను సృష్టించటం కోసమే సంకల్ప యాత్రను కేంద్రప్రభుత్వం చేపడుతోందన్నారు. అంతకుముందు హాలు వద్ద ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను గవర్నర్ సందర్శించారు. ప్రదర్శనలో ఉన్న పథకాల వివరాలను నిర్వాహకులు ఆయనకు వివరించారు. ఐసీడీఎస్ స్టాల్ వద్ద చిన్నారికి గవర్నర్ అన్నప్రాసన చేసి ఆశీర్వదించారు. గాజువాక పరిధిలో 10వేల మొక్కలు నాటే బృహత్ కార్యక్రమానికి ఏయూ కన్వెన్షన్ హాలు వద్ద మొక్క నాటి శ్రీకారం చుట్టారు. సభా వేదికపై ఉజ్వల పథకం లబ్ధిదారులైన మహిళలకు ధృవీకరణ పత్రాలు అందజేశారు. క్రీడాకారులు దాసరి స్రవంతి, కుసుమంచి తేజేశ్, వెలగలనేటి కిరణ్ కుమార్లను గవర్నర్ సత్కరించారు. కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక వ్యవహారాల శాఖ సంయుక్త కార్యదర్శి సాల్మన్ ఆరోక్య రాజ్, విశాఖ మేయర్ గొలగని హరి వెంకట కుమారి, జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, ఏయూ ఇన్‌ఛార్జి వీసీ ప్రొ.కె.సమత, స్థానిక కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వ్యవసాయరంగంపై ప్రభుత్వాల నిర్లక్ష్యం

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రామచంద్రరావు, కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-త్రిపురాంతకం: వ్యవసాయ రంగాన్ని ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామ చంద్రరావు, కేవీవీ ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకాశం జిల్లా త్రిపురాంతకంలోని ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో గురువారం 13వ ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా మహా సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామ చంద్రరావు, కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ... రైతులు ఆత్మహత్యలు చేసుకోకుండా ఉండాలంటే.. పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, పెట్టుబడి సహాయం అందించాలన్నారు. అధికారంలోకి వస్తే స్వామినాథన్ కమిషన్ నివేదిక అమలు చేస్తామని హామీ ఇచ్చిన బీజేపీ... ఇప్పుడు అమలు చేస్తే ఆర్థిక సంక్షోభం వస్తుందంటూ మోసపూరిత మాటలు చెప్తున్నారన్నారు. కేవలం కార్పొరేట్ సంస్థల అభివృద్ధికి పాటు పడే పార్టీ బీజేపీ అన్నారు. ఉపాధి హామీ పథకంలో 50 శాతం నిధులు వ్యవసాయ రంగానికి కేటాయించాలని, 50 సంవత్సరాలు నిండిన ప్రతి రైతుకూ రూ.10 వేల రూపాయలు పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో రైతు సంఘం ఉండేలా చేర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులకు సూచించారు. గుండ్లకమ్మ ప్రాజెక్ట్ గేటు కొట్టుకు పోవడం వల్ల ప్రాజెక్ట్‌లో ఉండవలసిన నీరు పూర్తిగా నదుల పాలు అయ్యాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కరువు నెలకొందని, రాయలసీమ ప్రాంతంలో 3 అడుగుల లోతున భూగర్భ జలాలు పడిపోయాయని తెలిపారు. రాష్ట్రంలో కరువు, తుపాన్ వల్ల పెద్ద ఎత్తున పంట నష్టం జరిగిందన్నారు. కరువు పరిస్థితులపై ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా రైతుసంఘం ఆందోళనలు చేసిందని, నష్ట తీవ్రతను తెలిసేలా చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 30 నాటికి కరువు మండలాలపై నివేదికను కేంద్రానికి పంపాల్సి ఉండగా... సరైన సమయంలో నివేదిక పంపక పోవడంతో తుపానుతో పంట కోల్పోయిన రైతులకు పంట నష్టం బీమా వర్తించలేదన్నారు. రైతులకు సంబంధించి 2022 నాటి ధాన్యం కొనుగోలు డబ్బులు, గోనెసంచుల డబ్బులు ఇవ్వలేదని గుర్తు చేశారు. అనేక సమస్యలు పరిష్కరించిన ఘనత ఆంధ్రప్రదేశ్ రైతు సంఘానికి ఉందని తెలిపారు. తొలుత సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య రైతుసంఘం జెండా ఎగురవేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మహా సభలో ప్రజా నాట్యమండలి కళాకారులు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై గేయాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి జములయ్య, జిల్లా అధ్యక్షులు డీ శ్రీనివాస్, కార్యదర్శి హనుమా రెడ్డి, వీరారెడ్డి, యాసిన్, జిల్లా కార్యదర్శి ఎం ఎల్ నారాయణ, బాణాల రామయ్య, కొండయ్య, లక్ష్మి, రమణమ్మ, గురునాథం, తిరుమలయ్య, మాచర్ల తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడ చెత్త అక్కడే...

సమ్మె బాటలో మున్సిపల్ కార్మికులు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ రాష్ట్రంలో సమ్మెలు, ఆందోళనలు, నిరసనలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే అంగన్వాడీలు, ఆశాలు, వలంటీర్లు ఆందోళన బాట పట్టగా... మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమ్మె గురువారం మూడో రోజుకు చేరుకుంది. సమ్మె కారణంగా విశాఖ నగరంలో ఎక్కడ చెత్త అక్కడ పేరుకుపోయి... చెత్తకుప్పలతో నగరం కంపు కొడుతోంది. మున్సిపల్ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సమ్మె బాట పట్టారు. రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు సమ్మెలో పాల్గొనడంతో నగరాల్లో పారిశుద్ధ్యం క్షీణించింది. ఇప్పటికే నగరంలో అనేక ప్రాంతాల్లో విషజ్వరాలు తీవ్రంగా ఉన్నాయి. దోమల బెడదతో ప్రజలు తీవ్ర రోగాలకు గురవుతున్నారు. మరోపక్క నగరంలో కరోనా కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరిస్తే తప్ప సమ్మె విరమించేది లేదని కార్మికులు స్పష్టం చేస్తున్నారు. జీవీఎంసీలో 5400 మంది కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికులు, మరో 700 మంది క్లాప్ వాహనాల డ్రైవర్లు, 200 మంది సుయేజ్ ఫామ్‌లో పనిచేస్తున్నారు. వీరంతా సమ్మెలో పాల్గొనడంతో ఎక్కడ చూసినా చెత్తకుండీలు నిండిపోయి రోడ్లపై కుప్పలు కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. విశాఖలో రోజు 900 మెట్రిక్ టన్నుల చెత్త లభ్యమవుతుండగా...గత మూడు రోజులుగా భారీగా పేరుకుపోయిన చెత్త కారణంగా తరలింపు కష్టతరంగా మారింది. అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నారు. వెయ్యి మంది పర్మినెంట్ ఉద్యోగులతో మరో 800 మంది రోజువారీ కార్మికులతో చెత్త తరలింపునకు ప్రయత్నిస్తున్నారు. గురువారం 380 టన్నుల చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించామని జీవీఎంసీ అదనపు కమిషనర్ వి.సన్యాసిరావు తెలిపారు.

లాసెట్ ప్రవేశాలకు అడ్డంకులు

వెబ్ కౌన్సెలింగ్‌కు సాంకేతిక లోపాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఏపీ లాసెట్/పీజీ సెట్-2023 ఫైనల్ విడత వెబ్ కౌన్సెలింగ్‌కు ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఆప్షన్ల ఆన్‌లైన్ సేవలు పనిచేయనందున అభ్యర్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ కౌన్సెలింగ్‌కు ఈనెల 21వ తేదీ నుంచి 23 వరకు దరఖాస్తులు స్వీకరించారు. 22 నుంచి 26 వరకు ఆన్‌లైన్‌లో ధ్రువీకరణ పత్రాల పరిశీలన, 27 నుంచి 29 వరకు వెబ్ ఆప్షన్ల నమోదుకు గడువు ఇచ్చారు. 30వ తేదీన ఆప్షన్లలో మార్పులు-చేర్పులకు, 2వ తేదీన సీట్ల కేటాయింపునకు షెడ్యూలు ఇచ్చారు. సీట్లు పొందిన వారంతా జనవరి 3 నుంచి 5వ తేదీ వరకు ఆయా కళాశాలల్లో రిపోర్టింగ్ చేయాలని నోటిఫికేషన్‌లో సూచించారు. వెబ్‌కౌన్సెలింగ్ అస్తవ్యస్తంగా ఉన్నందున మంచి ర్యాంకులు వచ్చిన అభ్యర్థులూ కౌన్సెలింగ్‌లో భాగస్వాములు కాలేకపోయారు. ఏపీ లాసెట్ కౌన్సెలింగ్‌కు సంబంధించి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచిన హెల్ప్‌డెస్క్ పనిచేయక అభ్యర్థులకు దిక్కుతోచడం లేదు. దీంతో కౌన్సెలింగ్‌లో అవకతవకలు జరుగుతున్నాయన్న అనుమానాలను అభ్యర్థులు వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఏపీ లాసెట్ కన్వీనర్ స్పందించి కౌన్సెలింగ్ సమర్థవంతంగా నిర్వహించాలని, ర్యాంకులు వచ్చి సాంకేతిక కారణాల రీత్యా ఆన్‌లైన్‌లో నమోదు చేయని వారందరితోను, వ్యక్తిగతంగాను, మెయిల్ ద్వారా వారి ధ్రువీకరణ పత్రాలు స్వీకరించి సీట్ల కేటాయింపులు చేపట్టాలని కోరారు. వెబ్ కౌన్సెలింగ్‌లో ఎదురైన సాంకేతిక సమస్యలను దృష్టిలో ఉంచుకుని గడువు పొడిగించాలని, వెబ్ కౌన్సెలింగ్‌లో అలసత్వానికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అభ్యర్థులు కోరుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ

ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు

అర్.ఓ.సి.నెం.2414/2023/ఇ1 తేది: 28-12-2023

నిట్ నెం.47/ఇ.టి.ఓ/2023-24

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ - నగరపాలక సంస్థ సాధారణ నిధుల క్రింద మొత్తము 25 పనులకుగాను ఈ దిగువ ఉదహరించిన తేదీల యందు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండరు పిలువబడినది.

మొత్తము పనులు - 25 నెం.లు	అంచనా వ్యయము రూ.212.95 లక్షలు
పని నెం. 01 నుండి 23 లకు :	
1. టెండరు షెడ్యూల్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన ప్రారంభ తేదీ	: ది.29-12-2023 ఉదయము గం.11.00ని.ల నుండి
2. టెండర్ల షెడ్యూల్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన చివరి తేది	: ది.05-01-2024 ఉదయము గం.11.00ని.ల వరకు
3. ప్రైస్ బిడ్ తెరుచు తేది	: ది.05-01-2024 మధ్యాహ్నము గం.2.00 ని.లకు
పని నెం. 24 నుండి 25 లకు :	
1. టెండరు షెడ్యూల్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన ప్రారంభ తేదీ	: ది.29-12-2023 ఉదయము గం.11.00ని.ల నుండి
2. టెండర్ల షెడ్యూల్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన చివరి తేది	: ది.01-01-2024 ఉదయము గం.11.00ని.ల వరకు
3. ప్రైస్ బిడ్ తెరుచు తేది	: ది.01-01-2024 మధ్యాహ్నము గం.2.00 ని.లకు

మిగతా వివరములకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ http://www.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు. మొబైల్ నెం.9849907303

సం/- వి.నిర్మల్ కుమార్, కమిషనరు,
మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ

సంపాదకీయం

రామాలయమే రాజకీయం

2024 ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బీజేపీ తక్షణమే కొన్ని పనులు పూర్తి చేయాల్సి వుంది. అందులో ఒకటి అయోధ్యలో రామాలయ నిర్మాణం. మతానికి రాజకీయ రంగు పులమాలన్నా, రాజకీయంలోకి మతాన్ని చొప్పించాలన్నా బీజేపీ ఒక్కటే చేయగలదు. ఎందుకంటే అది బీజేపీ పేటెంట్ హక్కు, మతమనేది వ్యక్తిగతం. ఈ విషయాన్ని అన్ని మతాలూ చెపుతాయి. మతం మత్తుమందు లాంటిదని కారల్‌మార్క్స్ చెపుతారు. దాన్ని మించిన మాదకద్రవ్యం ఇంకొకటిలేదు. అందుకే సంఘ్‌పరివార్ శక్తులు ఈ మతానికి ఉన్మాదాన్ని జోడించి, ఆ మత్తులో జోగుతూ వుంటాయి. ఆలయాన్ని 'అర్జంటు'గా నిర్మించడం తప్ప ఇప్పుడీ 'పరివారాని'కి ఇంకేం పనిలేదు. నేరం, పిరికితనం, కుటిలత్వం ద్వారా సంపాదించిన భూమిపై ఎటువంటి పవిత్ర భావన నిజంగా తలెత్తదని, అయోధ్యలో రామాలయ నిర్మాణం తీవ్ర అన్యాయానికి చిహ్నమని అపూర్వానంద్ వంటి మేధావులు చెప్పినా తలకెక్కని అవ్యవస్థలో సంఘ్ పరివార్ ఉంది. మతోన్మాదమంటే మనస్కరించని ప్రతిపక్ష కాంగ్రెస్ వారినీ, వామపక్షాలనూ సైతం 2024 జనవరి 22న జరిగే రామాలయ ప్రారంభోత్సవానికి బీజేపీ ప్రభుత్వం ఆహ్వానిస్తోంది. ఈ విషయంలో పూర్తి 'సానుకూలం'గా వ్యవహరిస్తామని మోదీ మనుషులు ముక్కుసూటిగా చెపుతున్నారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ఖడ్గే తదితరులు ఈ ఆహ్వానాన్ని తిరస్కరించి, గైర్హాజరైతే 'హిందూ మత వ్యతిరేకులు'గా ముద్ర వేయాలన్న అతిపెద్ద కుటిలనీతి వారి ఆహ్వానం వెనుక దాగివుందన్నది సర్వవిధితం. మురళీ మనోహర్‌జోషి, లాల్ కృష్ణ అద్వాణీ వంటి అసలు భక్తులకు ఇంకా ఆహ్వానమే అందలేదు. అంతలోనే 'కొసరు' వ్యక్తులకు ఆహ్వానాలు పంపి రాజకీయ క్రీడ మొదలుపెట్టారు. అసలు రామాలయ ప్రారంభోత్సవం ప్రభుత్వ అధికారిక కార్యక్రమమా? లేదా భక్తుల భక్తిరస కార్యక్రమమా? కొన్ని చీకటి రోజులను మనం మర్చిపోలేం. అందులో ఒకటి బాబ్రీ మసీదు విధ్వంసం. 1986లో ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలో బాబ్రీ మసీదు తాళాలను తొలిసారిగా తెరిచారు. ఈ నిర్ణయానికీ, బాబ్రీ మసీదు విధ్వంసానికీ మధ్య కేవలం ఆరు సంవత్సరాల నిడివి మాత్రమే. నిజానికి బీజేపీ చేసిన రెండో తప్పిదమిది. 1949లోనే తొలి తప్పు జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు కొందరు బాబ్రీ మసీదులో కొన్ని విగ్రహాలను పెట్టడాన్ని విస్మరించింది. ఆనాడు మూసిన తలుపులను ఇన్నేళ్లకు మళ్లీ తెరవడమే ఆ మసీదు విధ్వంసానికి దారితీసింది. స్మగ్లింగ్ చేయబడిన హిందూదేవతలకు చెందిన మూర్తులను 1949లో రాత్రికిరాత్రి మసీదులో పెట్టడం (దీన్నే వాళ్లు ప్రతిష్ఠించడమని అంటారు) ఒక నేరమైతే, 1992 డిసెంబరు 6వ తేదీన పట్టపగలే ఆ మసీదును కూల్చడం రెండో నేరం. రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలోనే ఇది జరగడం, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ నిష్క్రియాపరత్వమూ నేరమే. ఇవి నేరపూరిత చర్యలని సుప్రీంకోర్టు సైతం ప్రకటించింది. కాకపోతే అదే సుప్రీంకోర్టు 2019లో బాబ్రీ మసీదు కూల్చిన చోటనే రామాలయం కట్టుకోవడానికి అనుమతినిచ్చింది. ఇది అప్రస్తుతం. వివిధ నేరాల కారణంగా లభించిన స్థలంలోనే రామాలయం కట్టుకోవాల్సి వచ్చింది. ఇది గమనార్హం. అయోధ్య తీర్పు సుప్రీంకోర్టు తీర్పుల్లోనే అరుదైనది. ఆ తీర్పులో తన పేరును నమోదు చేయడానికి ఒక న్యాయమూర్తి ఇష్టపడలేదు. అది పిరికితనమనుకోనీ...ఇంకేమైనా అనుకోనీ! ఈ తీర్పును గుర్తుపెట్టుకోవాలని ఏ న్యాయమూర్తీ ఆశించలేదనేది విస్పష్టం. ఇప్పుడు ఢిల్లీలో అధికారంలో ఉన్నది కూడా బీజేపీనే. అందుకే మోదీ ప్రభుత్వానికి ఈ నేరాన్ని కొనసాగించడం తప్ప వేరే ఆప్షన్ లేదు. 500 ఏళ్లుగా బాబ్రీ మసీదు ఇదే స్థలంలో ఉందని, ఏదైనా గుడిని కూల్చి మసీదును కట్టిన దాఖలాలు లేవని, హిందూ దేవతా విగ్రహాలను స్మగ్లింగ్ చేసి, తెచ్చి మసీదులో పెట్టేవరకు అంటే 1949 వరకూ ముస్లిమ్‌లు ఇక్కడే ప్రార్థనలు చేసుకునేవారని, స్మగ్లింగ్ అనేది నేరమని కోర్టు తన తీర్పులో పేర్కొన్న అంశం ప్రస్తావనార్హం. అన్నీ చెపుతూనే అక్కడ రామాలయాన్ని నిర్మించుకోవడానికి అనుమతినిచ్చింది. ఏదేమైనప్పటికీ, నేరాలు, పిరికితనం, జిత్తుల మారితనం వంటి అవలక్షణాలతో దక్కిన ప్రదేశంలో నిర్మించిన రామాలయానికి ఎట్టకేలకు 2024 జనవరి 22న ప్రారంభోత్సవం చేస్తారు. ఇక్కడ దక్కే ఆధ్యాత్మిక శాంతి అందరికీనా, లేదా కొందరికేనా అన్నది వేచిచూడాలి.

ఇక్కడొక విషయాన్ని విస్మరించరాదు. గుళ్లు, గోపురాలు ఎక్కడైనా కట్టుకోవచ్చు, అనుమతి ఉంటే ఎవరైనా కట్టుకోవచ్చు. దీనికి అభ్యంతరాలేమీ ఉండవు. 1947 ఆగస్టు 15వ తేదీకి ఉన్నంత ప్రాధాన్యత జనవరి 22కి ఉందని రామమందిర్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్ వ్యాఖ్యానించడం వివాదాస్పదమైంది. అలాగే 1971లో లక్షలాది మంది పాకిస్థానీ సైనికులు భారత సైన్యం ముందు మోకరిల్లడానికి, 1999లో కార్గిల్‌లో భారత త్రివర్ణపతాకం ఎగరవేయడానికి ఎంత ప్రాధాన్యత ఉందో ఈ జనవరి 22కు అంత ప్రాధాన్యత ఉందని కూడా ఆయన వ్యాఖ్యానించారు. అంటే అయోధ్య రామాలయ నిర్మాణ పరమోద్దేశం మతపరమైనది కాదని, ఆధ్యాత్మికమైనదీ కాదని తేలిపోయింది. మందిర్‌ను ఒక జాతీయవాదంగా బీజేపీ నిర్మిస్తున్నదని అర్థమవుతోంది. అదొక జాతీయ భావంగా, అదొక మతంపై వేరొక మతం సాధించిన విజయంగా, హిందూరాజ్య స్థాపనకు ఒక పునాదిగా, పరమత హననానికి ఒక మలుపుగా ఆ పార్టీ భావిస్తున్నదని చంపత్‌రాయ్ మాటల్లో స్పష్టమవుతోంది. ఆధ్యాత్మిక భావనకు, మతోన్మాదానికి మధ్య ఉన్న అతిపెద్ద గీతను ఆయన చెరిపేశారు. అతిపెద్ద కుట్రలు, హింసలు లేకుండానే బ్రిటిష్‌వారి కబంధ హస్తాల నుంచి భారత్ విముక్తి పొందింది. అసలు ఆ స్వాతంత్ర్యోద్యమంలో ఏ మాత్రం పాత్ర లేని సంఘ్‌పరివార్ 1947 ఆగస్టు 15కి, 2024 జనవరి 22కి మధ్య సమపోలిక తీసుకురావడం వారి అవివేకానికి పక్కా నిదర్శనం. ఉద్యమకారులకు, విధ్వంసకారులకు మధ్య తేడాను సంఘ్ శక్తులు తెలుసుకోవడం ఉత్తమం. సంఘ్ శక్తులు ఈ సందర్భంలో రామునికి రక్షకులా, రామాలయానికి రక్షకులా లేక పాలక బీజేపీకి రక్షకులా? ఆనాడు టొయోటా ట్రక్కులో అద్వాణీ రథయాత్ర జరిపి, అడుగడుగునా రక్తపాతం సృష్టించి, ఈ అపవిత్ర ప్రయాణానికి ఆరంభం పలికారు. ఇప్పుడీ ప్రయాణానికి శుభంకార్డు పడుతుందని ఆశించగలమా? ఆనాటి రక్తపుటేరులకు సమాధానమివ్వాలి. అయోధ్య రామాలయ నిర్మాణం పరిపూర్తయ్యే క్రమంలో 'మతం' పేరిట కోట్లాది రూపాయల వసూళ్లు జరిగాయి. ఆర్‌ఎస్‌ఎస్ వారు రూపాయి ఖర్చు పెట్టలేదు. ప్రతి ఇటుక జనం నుంచి తీసుకువచ్చినదే. అయోధ్య పేరుతో ఒక మతానికి మోదీ విపరీతంగా ప్రాధాన్యతనిస్తున్నారని, రామమందిరం చుట్టూనే దేశం ప్రదక్షిణలు చేస్తున్నదని ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ పార్టీ ఛైర్మన్ శామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్య అక్షరసత్యం. మోదీ తన పూర్తి సమయాన్ని ఆలయాలకే కేటాయిస్తే ఆధునిక భారతదేశం ఎలా నిర్మితమవుతుంది? ఇది ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేయడం కాదా? దీన్ని జాతీయ అంశంగా మార్చి గందరగోళాన్ని సృష్టించడం సరికాదు. విద్య, ఉపాధికల్పన, ఆర్థిక ద్రవ్యోల్బణం, పర్యావరణం, కాలుష్యం వంటి సమస్యలేవీ జాతీయ అజెండాలు కావా? రాజకీయాలకోసం మతాన్ని దుర్వినియోగం చేయడం కాదా? మతానికి రాజకీయాలను, రాజకీయాలకు మతాన్ని ఈస్థాయిలో ముడిపెట్టడం ఏనాడైనా విన్నామా? కన్నామా? రామాలయం ప్రధానాంశంగా మార్చి, వచ్చే ఎన్నికల్లో మరోసారి బీజేపీని కేంద్రంలో కూర్చోబెట్టడానికి 130 కోట్ల మంది ప్రజలను మోసం చేయాలా? 'రామాలయమే రాజకీయం, రాజకీయమే రామాలయం' అని జనం గుర్తించకుండా ఉంటారా?

మట్టి మనుషుల గుండె చప్పుడు...

నిజాం నిరంకుశ పదఘట్టనలు.. వెట్టిచాకిరి బతుకులు... బాంచెన్ దొర... నీ కాల్మొక్త దొర అంటూ... తలదించుకుని బతికే కాలం... మట్టి మనుషుల్లో పోరాట స్ఫూర్తిని నింపిన అగ్నికణం బద్దం ఎల్లారెడ్డి. తాడిత, పీడిత ప్రజలను ఏకం చేసి వ్యవసాయ పనిముట్లను ఆయుధంగా మలిచి బానిసత్వంపై తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. పేదప్రజల పక్షాన, వెట్టిచాకిరి విముక్తికోసం ఎర్రజెండా నీడలో సాయుధపోరాటానికి బాటలు వేశారు. నాటి హైదరాబాద్ సంస్థానం రాజులు, ఆయన తాబేదార్ల నియంత పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధ. జనవాహినిని అక్కున చేర్చుకొని నిజాం గుండెల్లో కత్తులు దించిన విప్లవోద్యమ కదలి తరంగం. నిజాం పిశాచానికి ముచ్చెమటలు పట్టించిన వీరుడు బద్దం ఎల్లారెడ్డి. అజ్ఞాతవాసంతో చరిత్రాత్మక పోరాటాన్ని సాగించారు. పూర్వపు కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండలం గాలిపెల్లికి చెందిన బద్దం ఎల్లారెడ్డి నిఖార్సయిన పోరాట యోధుడు. 1951లో జరిగిన తొలి ఎన్నికల్లోనే పీడీఎఫ్ అభ్యర్థిగా కరీంనగర్ పార్లమెంట్ స్థానం నుంచి బద్దం ఎల్లారెడ్డి విజయం సాధించారు. సొంత భూమిని పేదలకు పంచిన మానవతావాది. తుదిశ్వాస విడిచేవరకు అట్టడుగువర్గాల మేలుకోరిన ప్రజానేత ఎల్లారెడ్డి. నిజాయితీగల నేతగా ప్రజల్లో పేరు తెచ్చుకున్నారు. బస్సులోనే ప్రయాణిస్తూ సామాన్యులతో కలిసిపోయేవారు.

గాలిపెల్లికి చెందిన బద్దం హన్మంతరెడ్డి, లచ్చవ్వల రెండో సంతానంగా 1906లో జన్మించిన బద్దం ఎల్లారెడ్డి మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఆశయాలకు ప్రభావితుడయ్యారు. 1930 నుంచి కమ్యూనిజం వైపు ఆకర్షితులయ్యారు. 1938లో సత్యాగ్రహానికి పూనుకున్నారు. సాయుధ పోరాటంలో ఆయన జైలుకు కూడా వెళ్లారు. 1939లో కమ్యూనిస్టు పార్టీ హైదరాబాదులో శాఖను ప్రారంభించగా దానిలో రావి నారాయణరెడ్డిలాంటి వారితో కలిసి బద్దం ఎల్లారెడ్డి పనిచేశారు. విద్యార్థి దశలోనే పోరుబాట పట్టారు. 1930లో కాకినాడ ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొని 7 మాసాలు జైలు శిక్షకు గురయ్యారు. తెలంగాణ సాయుధ పోరాటం సమయంలో అగ్రనాయకులలో ముఖ్యులుగా మారారు. సాయుధ పోరాట కాలంలోనూ అరెస్ట్ అయి 3 సంవత్సరాలు జైలుశిక్ష అనుభవించారు. ఎల్లారెడ్డి 1952లో పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్ తరపున కరీంనగర్ లోకసభ నియోజకవర్గం నుంచి పీవీ నరసింహారావుపై విజయం సాధించారు. 1956లో సీపీఐ కేంద్ర కార్యవర్గ సభ్యులయ్యారు. 1958లో బుగ్గారం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. 1964లో రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1972లో ఇందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎన్నికై శాసనసభలో రెండోసారి ప్రవేశించారు

తెలంగాణ విముక్తి ఉద్యమం చురుగ్గా సాగుతున్న దశలో 1935 డిసెంబర్‌లో సిరిసిల్లలో నాల్గో ఆంధ్ర మహాసభ మాడపాటి హన్మంతరావు అధ్యక్షతన జరిగింది. ఈ సభలో బద్దం ఎల్లారెడ్డి అగ్రభాగాన ఉన్నారు. ఇక్కడ తీసుకున్న కీలక నిర్ణయాలతో విముక్తి పోరాటం ఉవ్వెత్తున ఎగిసింది. ఉద్యమ స్వరూపాన్నే మార్చింది. గెరిల్లా దళాలకు మానాల క్యాంపులో శిక్షణ ఇస్తూ... పోరాటానికి బాటలు వేశారు. పెత్తందార్ల నుంచి పేదల అప్పు పత్రాలను తెచ్చి ప్రజల సమక్షంలో కాల్చివేశారు. ఇది జీర్ణించుకోలేని నిజాం పోలీసులు ఉద్యమకారులపై ఉక్కుపాదం మోపుతూ నిర్బంధాన్ని అమలు చేశారు. గాలిపెల్లిలో పోలీసులు కాల్పులు జరపగా పదకొండు మంది ఒకేరోజు అమరులయ్యారు. నిజాం సాగించిన మారణహోమానికి గాలిపెల్లి నేల రక్తంతో తడిసి బలిపీఠమైంది. శ్రమదోపిడీకి వ్యతిరేకంగా సాగిన పోరాటంలో ఎల్లారెడ్డి ముఖ్య పాత్ర పోషించారు. గాలిపెల్లిలో తన సొంత భూములను పేదలకు పంచడంతో పాటు సిరిసిల్ల ప్రాంతాల్లో దున్నేవాడిదే భూమి అంటూ ఉద్యమాన్ని రగిలించారు. ప్రజాజీవనంలో నేటి తరం నేతలకు బద్దం ఎల్లారెడ్డి స్ఫూర్తిగా నిలుస్తారు.

(నేడు బద్దం ఎల్లారెడ్డి 45వ వర్థంతి సందర్భంగా)

ఎం. కృష్ణచైతన్య

రాహుల్ యాత్ర 'ఇండియా'కు స్ఫూర్తి

అరుణ్ శ్రీ వత్సవ

కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ మొదటి దశలో భారత్ జోడోయాత్రను నిర్వహించడంవల్ల ఆ పార్టీ పునరుజ్జీవనం పొందడానికి అవకాశాలు కలిగాయి. రెండవ దశలో జనవరి 14నుంచి భారత్ న్యాయయాత్రను నిర్వహించనున్నారు. మణిపూర్ నుంచి ఈ యాత్ర ప్రారంభమవుతుంది. 14 రాష్ట్రాలు, 85 జిల్లాలమీదుగా ఈ యాత్ర సాగుతుంది. అత్యంత క్లిష్టమైన యాత్రను రాహుల్ చేపట్టారు. 2024లో లోకసభ ఎన్నికలు జరగడానికి కొన్ని నెలల ముందు న్యాయయాత్ర నిర్వహిస్తున్నారు. ఈ యాత్ర ప్రజలను కదిలించి ఇండియా కూటమికి ప్రోత్సాహాన్నిస్తుంది. సామాన్య ప్రజలను ఈ యాత్ర తప్పకుండా ఆకర్షిస్తుంది. మొదటి దశలోనే రాహుల్ యాత్రకు బ్రహ్మాండమైన స్పందన లభించింది. రాజకీయ వర్గాలను కదిలించింది. సామాన్య ప్రజలను ఆకర్షించింది. ఈసారి యాత్ర సామాన్య ప్రజలలో నూతన ఉత్సాహం కలిగిస్తుందని భావిస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ భవిష్యత్తును ఈ యాత్ర అడ్డుకుంటుందా లేదా మరోసారి ఫలితం లేనిదవుతుందా అనే అంశాన్ని దేశవ్యాప్తంగా చర్చిస్తున్నారు. తొలిదశ యాత్రలో ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ ప్రజలలో మంచిస్పందన వచ్చినప్పటికీ, కాంగ్రెస్ గెలుపు సాధ్యంకాలేదు. కాంగ్రెస్‌కు ఓటు వేయవలసిందిగా తొలిదశ యాత్రలో ప్రచారం జరిగింది. న్యాయయాత్ర మూలంగా ప్రయోజనం జరుగుతుందా లేక వైఫల్యం పొందుతుందా అనే సందేహాలు కూడా ఉన్నాయి.

భారత్ జోడోయాత్ర సందర్భంగా రాహుల్‌గాంధీ ప్రజలలో ఆర్థిక అసమానతలు, వివిధ వర్గాల సమీకరణలు మోదీ ప్రభుత్వ నియంతృత్వం అంశాలను ప్రచారం చేశారు. న్యాయయాత్ర సందర్భంగా కాంగ్రెస్ పాలనవస్తే సామాజిక భద్రత, దేశప్రజలకు ఆర్థిక, రాజకీయ, న్యాయం కల్పిస్తామని ప్రధానంగా ప్రచారం చేయనున్నారు. సామాన్య ప్రజల జీవనం ఎంత దారుణంగా ఉన్నదనే అంశాన్ని ప్రధాన చర్చనీయాంశంగా చేయనున్నారు. మండల్ రాజకీయాలకు సంబంధించి మౌలిక అంశాలను ప్రజలదృష్టికి తీసుకువెళ్లనున్నారు. ప్రస్తుతం భారతదేశంలో వాస్తవంగా రాజకీయ కార్యాచరణలో నియంతృత్వంగా వ్యవహరిస్తున్నారు. న్యాయయాత్ర 6200కిమీ సాగిన అనంతరం మార్చి 25న ముంబైలో ఆగిపోతుంది. మణిపూర్, నాగాలాండ్, అసోం, మేఘాలయ, పశ్చిమబెంగాల్, జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర మీదుగా సాగుతుంది. భారత్ జోడోయాత్రకి, భారత్ న్యాయయాత్రకు ఒక తేడా ఉంది.

మొదటిదశ యాత్ర దాదాపు పూర్తిగా నడక ద్వారా జరిగింది. ఈసారి నడకతోపాటు బస్సుద్వారా కూడా యాత్ర జరుగుతుంది. మణిపూర్‌నుంచి ఈ యాత్ర ప్రారంభించడంలో ఒక ప్రత్యేకత ఉంది. ఈ యాత్ర మణిపూర్ తదితర రాష్ట్రాలలో కలిగిన గాయాలను మన్పుతుంది. మణిపూర్‌లో ప్రజలు అనుభవించిన చిత్రహింసలు, సామూహిక హత్యలు, తదితర బాధలను ఏనాడూ మర్చిపోలేదు. హిందుత్వశక్తులు కుకీ ఇతర గిరిజనులపై సాగించిన హింసాకాండను దేశప్రజలంతా చూశారు. నేటికీ అక్కడ ప్రశాంతత ఏర్పడలేదు.

మణిపూర్‌లో మెయితీలు, కుకీలు ఇతర గిరిజనుల మధ్య జరిగిన అంతర్యుద్ధంలాంటి పోరు దేశంలో ఎక్కడా జరగలేదు. 300 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 60వేలమంది నిరాశ్రయులయ్యారు. 2023 మే 3వ తేదీన హింసాకాండ చెలరేగింది. అత్యంత విచారకరమైన అంశం ఏమంటే మణిపూర్ రాష్ట్ర ప్రజలు నరేంద్రమోదీ నుంచి ఎలాంటి న్యాయం పొందలేకపోవడమే. మణిపూర్, మేఘాలయ, నాగాలాండ్ రాష్ట్రాలలో ఎక్కువ లోకసభ సీట్లు లేవు. ఓట్ల పరంగాకూడా ఈ ప్రాంతానికి అంత ప్రాముఖ్యం మోదీ ఇవ్వలేదు. మాటల్లో గొప్ప సందేశాలను మాత్రం వినిపిస్తారు. మోదీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు పూర్తిగా విశ్వసనీయతను కోల్పోయారు. భారత్ జోడోయాత్ర స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అంశాలను విస్తృతంగా ప్రచారం చేసినట్లు కాంగ్రెస్ నాయకుడు చెప్పారు. భారత్ న్యాయయాత్రలో న్యాయం, సామాజిక,ఆర్థిక, రాజకీయ అంశాలను ప్రజలదృష్టికి తీసుకువెళ్లనున్నారు.

ప్రధానమంత్రి రాజ్యాంగంపై పదేపదే దాడిచేస్తున్న అంశాన్ని ప్రచారంసాగిస్తూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పనున్నారు. భారత్ జోడోయాత్ర నిర్వహించినప్పుడు ఇండియా కూటమి ఇంకా ఏర్పడలేదు. ఇప్పుడు కూటమి ఏర్పడింది. దీనికి ఎంతో ప్రాముఖ్యత, సందర్భం ఉన్నాయి. మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, రాజస్థాన్‌లలో ఓటమి తర్వాత ప్రతిపక్షంగా ఎంతో పట్టుదలతో కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రచారం సాగించి విజయం పొందేందుకు కృషి చేయనున్నారు. కూటమిలో అన్ని పార్టీల కార్యకర్తలు న్యాయయాత్రలో తప్పనిసరిగా పాల్గొనాలి. సామాజిక న్యాయ సాధనకు అన్ని పార్టీలు అంకితం కావాలి. ఇండియా బ్లాక్ మండల్ రాజకీయాలు అనుసరించడానికి అన్ని పార్టీల కార్యకర్తలు పాల్గొనాలి.

అయితే ఇంతవరకు కాంగ్రెస్ నాయకులు తమ వ్యూహాన్ని ప్రకటించలేదు. అనుసరించవలసిన వ్యూహానికి సంబంధించిన వివరాలను ఇంకా రూపొందిస్తున్నారు. కాంగ్రెస్ ప్రచారకర్త జైరాం రమేశ్ మాట్లాడుతూ రాహుల్ యాత్ర న్యాయం, ఆర్థిక, సామాజిక, రాజకీయ లక్ష్యాల సాధనకు జరుగుతోంది. న్యాయ సాధనకు కాంగ్రెస్ అంకితమవుతుందని ప్రజలకు మరోసారి హామీ ఇవ్వడానికి రాహుల్ యాత్ర జరుపుతున్నాడని జైరాం రమేశ్ చెప్పారు. అ అంశాలన్నీ విశాలమైన ప్రభావాలను కలిగిస్తున్నాయి. ప్రతి పౌరుడుని తన వెంట నడిపించేందుకు న్యాయయాత్ర ఉద్దేశించింది. యువత, అంకితమైన పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు తప్పనిసరిగా ఈ యాత్రలో పాల్గొనాలి. అన్ని పార్టీల కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలతో సంబంధాలు ఏర్పరచుకుని బీజేపీ పరిపాలనలో జరిగిన అక్రమాలను, అన్యాయాలను ప్రజలకు వివరించాలి. అయోధ్యలో రామాలయం నిర్మాణం దాని ప్రాముఖ్యత హిందువులకు మోదీ చేసిన సేవలను బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం సాగిస్తున్నారు. అందువల్ల ఇండియాకూటమి పార్టీలు, కార్యకర్తలు అంతా ఒక్కటై ప్రచారం సాగించాలి. ఈసారి చేపట్టనున్న న్యాయయాత్రలో సమాజంలోని ట్రక్కు డ్రైవర్లు, మోటార్ మెకానిక్‌లు, వడ్రంగులు, కాయగూరల విక్రయదారులు, టోకు వ్యాపారులు, విద్యార్థులను రాహుల్ కలుసుకుంటారు. దేశంలో ఫాసిస్టు శక్తులను ఓడించేందుకు ప్రాంతీయపార్టీల కార్యకర్తలు భారీగా పాల్గొనాలి.

శతాబ్దాల దురాచారానికి ధిక్కరణ

దళితులు చెప్పులు ధరించకుండా లేదా గుర్తించిన వీధుల్లో సైకిల్ తొక్కకుండా నియంత్రిస్తూ అగ్ర కులాలవారు శతాబ్దాల క్రితం విధించిన అనాలోచిత కట్టుబాటును వారు సవాలు చేశారు. సమానత్వం దిశగా ఒక చారిత్రాత్మక పురోగతిలో ముందడుగువేశారు. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి ఉన్న ఆనాచారానికి అంతంపలికారు. తమిళనాడులోని రాజాపూర్ గ్రామంలోని కంబాల నైకెన్ వీధిలో తరతరాలుగా సాగుతున్న వివక్షతకు ఆ గ్రామ దళితులు చరమ గీతం పాడారు. నిషేధిత వీధిలో దళితులు తొలిసారి చెప్పులు వేసుకొని తిరిగారు. తద్వారా ఆ ప్రాంతంలోని అగ్రవర్ణాలు తమపై విధించిన అలిఖిత నిషేధాన్ని ధిక్కరించారు. అంతేకాకుండా ఆ గ్రామంలోని రాజకాళి అమ్మన్ దేవాలయంలోకి సైతం ప్రవేశించి వందలయేళ్ల మనుధర్మం ఇకనా ఇక చెల్లుబాటు కాదు అని ఖరాఖండిగా చెప్పేశారు. ఇందుకు పెరియార్ రామస్వామి వర్థతి అయిన డిసెంబరు 24 ఆదివారం ముహూర్తంగా నిర్ణయించారు. వివక్షకు అంతం పలికి సమానత్వం వైపు సాగడానికి ఇదొక చారిత్రాత్మక పురోగతిగా చెప్పవచ్చు. ఈ వివక్ష మూలాలు లోతుగా ఉన్నాయి. స్వాతంత్ర్యానంతరం అంటరానితనం నిషేధించినప్పటికీ, ఆధిపత్య కులాల వారు వీధికింద పాతిపెట్టినవూడూ బొమ్మ గురించి ఒక కథను ప్రచారం చేశారని, దళితులెవరైనా చెప్పులు ధరిస్తే మూడు నెలల్లో చనిపోతారని బెదిరించారని ఎస్సీ సంఘం సభ్యుడు తెలిపారు. కొంతమంది దళితులు ఈ కథలను విశ్వసించడం నేటికీ ఈ ఆచారాన్ని కొనసాగించడానికి సహాయపడింది. ఈ దురాచారానికి ఎలాగైనా అంతం పలకాలని కొంత మంది నిర్ణయించుకున్నారు. ఇందుకు పెరియార్ వర్ధంతిని ముహూర్తంగా నిర్ణయించుకున్నారు.

డిసెంబరు 24 ద్రవిడ ఉద్యమ నేత పెరియార్ రామస్వామి 50వ వర్ధంతి. ఆయన చిన్నప్పటి నుండి ఎందుకు? అని అడగడం అలవాటుగా మారి మతంలోని కుల వ్యవస్థ దాని నుండి ఏర్పడే దుర్మార్గాలను, దేవుడు మూఢనమ్మకాలను ఎదిరించడం నేర్చుకున్నారు. కాశీకి పోయి అక్కడ అనేక ఇబ్బందులు ఎదుర్కొని దేవుడు పేరుతో జరుగుతున్న మోసాలను చూసి నాస్తికుడిగా మారారు. బ్రాహ్మణాధిక్యతను ప్రశ్నిస్తూ అణగారిన వర్గాలకు అధికారం అంటూ ఉత్తరాది ఆధిపత్య నిర్మూలనపై కృషి చేస్తూ ద్రవిడ (తెలుగు తమిళం మలయాళం కన్నడ) భాషల పరిరక్షణకై పరితపిస్తూ ద్రవిడ ఉద్యమాన్ని ఆరంభించి ద్రవిడుల నినాదానికి పునాదివేసిన అభ్యుదయవాది అసలు సిసలైన సంఘ సంస్కర్త పెరియార్ రామస్వామి. దక్షిణ భారతీయులను రాక్షసులుగా, వానరులుగా చిత్రీకరించిందంటూ రామాయణాన్ని, రాముడిని తీవ్రంగా విమర్శించారు. దోపిడీరహిత ఆర్థిక సమానత్వంతో కూడిన వ్యవస్థ మన దేశంలోనూ రావాలని ఆశించి ఆ దిశగా అడుగులు వేసిన మట్టిమనిషి పెరియార్ . ఆయన వర్ధంతి రోజు శతాబ్దాల దురాచారానికి చరమ గీతం పాడడం శుభపరిణామం. దాదాపు 60 మంది దళితులు వీధిలో చెప్పులు వేసుకుని స్థానిక పోలీసుల పర్యవేక్షణలో నడవడం ద్వారా శతాబ్దాల దురాచారానికి అంతం పలికారు.

తమిళనాడులోని తిరుప్పూర్ జిల్లా మడతుకులం తాలూకాలోని రాజపూర్ గ్రామంలోని కంబళ నైకెన్ వీధిలో మొదటిసారిగా 60 మంది దళితులు పాదరక్షలు ధరించి నడిచారు. ఆ వీధి'లో పాదరక్షలు ధరించి నడిస్తే మూడు నెలల్లోగా మరణం సంభవిస్తుందన్న కథనాలు శతాబ్దాలుగా ఉన్నాయి. ఈ గ్రామంలో మొత్తం 900 కుటుంబాలు ఉండగా, అందులో 800 కుటుంబాలు అగ్రకులమైన గౌండర్లు, నైకర్లకు చెందినవి. 'అరుణ తతియార్' వర్గానికి చెందిన వారు కంబాలా నైచెన్ వీధిలో చెప్పులతో నడిస్తే అరిష్టమన్న మూఢనమ్మకాన్ని అగ్రవర్ణాలవారు విస్తృతంగా ప్రచారం చేశారు. వీరు కనుక పాదరక్షలతో నడిస్తే స్థానిక దేవత ఆగ్రహిస్తుందని, మరణాన్ని శాసిస్తుందని అగ్రవర్ణాల మహిళలు సైతం బెదిరిస్తారు. దానితో అక్కడి దళితులు పాదరక్షలు లేకుండానే శతాబ్ధాలుగా నడుస్తున్నారు. ఈ విషయం తెలుసుకుని తమిళనాడు అంటరానితనం నిర్మూలన ఫ్రంట్ (తిరుప్పూర్) కార్యదర్శి కనగరాజ్ గత వారం గ్రామాన్ని సందర్శించి ఆ దురాచారం గురించి తెలుసుకున్నారు. దళిత మహిళలకు ఆ వీధిలోకి ప్రవేశించడానికి కూడా అనుమతి లేదని కనుగొన్నారు.ఆ సంస్థ వారు నిరసనను ప్రారంభించాలని ప్రయత్నిస్తే.. పోలీసులు అనుమతి నిరాకరించారు. ఆ తర్వాత రాజకీయ పార్టీల కార్యకర్తలతో పాటు ఫ్రంట్ సభ్యులు వీధిలో నడవాలని నిర్ణయించుకున్నారు. పెరియార్ వర్ధంతి రోజున (డిసెంబర్ 24) చెప్పులు వేసుకుని ఆ వీధిలో నడిచే కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారు. అక్కడితో ఆగకుండా ఆ 60 మంది సభ్యుల బృందం ఈ నడక విముక్తి దిశగా ఒక ముఖ్యమైన అడుగు, కానీ కొంతమంది దళితులు ఇప్పటికీ భయంతో ఆ వీధిలో నడవడానికి వెనుకంజ వేస్తున్నారు. అయితే, ఈ చర్య విశ్వాసాన్ని నింపుతుందనీ, సమానత్వానికి మార్గం సుగమం చేస్తుందని చెప్పడంలో ఎటువంటి అనుమానంలేదు.

ఎం. మురళీకృష్ణ

ప్రజా సంక్షేమం, పురోగతే ధ్యేయం

- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే
- పార్టీలో ఉండటం గర్వకారణం: రాహుల్, వేణుగోపాల్
- ఘనంగా 139వ వ్యవస్థాపక దినం

న్యూఢిల్లీ: ప్రజాస్వామ్యం, సమానత్వమే ఆధారంగా భారతదేశ నిర్మాణానికి కాంగ్రెస్ ఎల్లప్పుడు పనిచేసిందని పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. కాంగ్రెస్ 139వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని పార్టీ కేంద్ర కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఖర్గే ఆవిష్కరించారు. కార్యక్రమంలో అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా పాల్గొన్నారు. భారత ప్రజల పురోగతి, సంక్షేమమే ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ లక్ష్యమని ఖర్గే వెల్లడించారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, సమానత్వం, అందరికీ సమాన అవకాశాలు, వివక్ష లేని రాజకీయ, ఆర్థిక, సామాజిక హక్కులున్న రాజ్యాంగం ఉండే భారతదేశ సిద్ధాంతాన్నే కాంగ్రెస్ నమ్ముతుందని ఎక్స్ మాధ్యమంగా తెలిపారు. 138 ఏళ్లుగా దేశం కోసం పూర్తి నిబద్ధత, నిజాయతీతో పనిచేస్తునందుకు గర్వ పడుతున్నామన్నారు. వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రతి భారతీయుడికి హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ప్రతీక కాంగ్రెస్ అని ఖర్గే పేర్కొన్నారు. రాజ్యాంగానికి, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు కట్టుబడతామని కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పునరుద్ఘాటిస్తున్నట్లు ట్వీట్ చేశారు. మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఎక్స్ మాధ్యమంగా కాంగ్రెస్ కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ వంటి వ్యవస్థతో అనుబంధం ఉండటం గర్వకారణమని, నిజం, అహింసే తమ పార్టీకి పునాదని, ప్రేమ, సౌభ్రాతృత్వం, గౌరవ మర్యాదలు, సమానత్వమే మూలస్తంభాలని, దేశభక్తి దాని పైకప్పు అని వర్ణించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఎక్స్ మాధ్యమంగా స్పందిస్తూ స్వాతంత్ర్యం కోసం పోరాడిన పార్టీ కాంగ్రెస్ అని, ఆధునిక భారతానికి పునాది వేసిందని, భారత ఆర్థిక వ్యవస్థను 21వ శతాబ్దానికి చేర్చేందుకు చోదకశక్తి అయ్యిందని, హక్కులకు భద్రత కల్పించిందని కొనియాడారు.

'ఇది కేవలం పార్టీ కాదు భారత ఆత్మ. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌తో ముడిపడి ఉండటం గర్వకారణం. 139వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జరుపుకోవడం సౌభాగ్యం' అని ఆయన ట్వీట్ చేశారు.

పెరుగుతున్న కోవిడ్ కేసులు

ఒకే రోజు 702 కేసులు...ఆరు మరణాలు

న్యూఢిల్లీ: భారత్‌లో కరోనా కేసుల ఉధృతి పెరుగుతోంది. గురువారం ఒక్కరోజే 702 కరోనా కేసులు పెరిగాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ గురువారం ఉదయం 8 గంటలకు పేర్కొంది. యాక్టివ్ కేసుల సంఖ్య 4,097కి పెరిగాయి. 24 గంటల వ్యవధిలో ఆరు కొత్త మరణాలు నమోదవగా, మహారాష్ట్ర నుండి ఇద్దరు, కర్నాటక, కేరళ, పశ్చిమబెంగాల్, దిల్లీలో ఒక్కొక్కరు చొప్పున మరణించినట్లు తెలిపింది. డిసెంబర్ 5 వరకు కేసులు రెండంకెలకు పడిపోయాయని, కొత్త వేరియంట్, చల్లని వాతావరణ పరిస్థితుల కారణంగా కేసుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని తెలిపింది. డిసెంబర్ 22న దేశంలో 752 కొత్త కేసులు నమోదయ్యాయి. 2020 మహమ్మారి ప్రారంభంలో రోజువారీ కేసులు లక్షల్లో గరిష్ఠస్థాయికి చేరుకున్నాయి. 4.5కోట్ల మందికి పైగా ప్రజలు వ్యాధి బారిన పడ్డారు. అప్పటి నుండి దేశవ్యాప్తంగా సుమారు నాలుగేళ్లలో 5.3 లక్షల మంది మరణించారు. జాతీయ రికవరీ రేటు 98.81 శాతంగా ఉండగా, వ్యాధి నుండి కోలుకున్న వారి సంఖ్య 4.4 కోట్లను దాటింది.

23 సీట్లలో ఉద్ధవ్ పోటీ

కుదరదన్న కాంగ్రెస్

ముంబై: మహారాష్ట్రలో సీట్ల సర్దుబాటుపై విపక్ష కూటమి మధ్య కసరత్తు కొనసాగుతోంది. వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో 23 సీట్లలో పోటీ చేస్తామంటూ శివసేన చేసిన డిమాండ్‌ను కాంగ్రెస్ తిరస్కరించింది. సార్వత్రిక ఎన్నికల కోసం మహారాష్ట్ర వికాస్ అఘాడీ కూటమిలో భాగస్వాములు శివసేన, కాంగ్రెస్, ఎన్సీపీ మధ్య సీట్ల పంపకం గురించి చర్చించేందుకు నేతలు సమావేశమైన అనంతరం ఈ పరిణామం చోటుచేసుకుంది. శివసేన, ఎన్సీపీ, కాంగ్రెస్ కలిసి ఎంవీఏ కూటమి పేరుతో మహారాష్ట్రలో 2019లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. 2022లో శివసేన సీనియర్ నేత ఏక్‌నాథ్ షిండే తన వర్గం ఎమ్మెల్యేలతో కలిసి పార్టీని రెండుగా చీల్చారు. బీజేపీతో చేతులు కలిపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో ఎంవీఏ కూటమి అధికారం కోల్పోవాల్సి వచ్చింది. రెండు వర్గాలుగా విడిపోయిన శివసేనలో ఏక్‌నాథ్ షిండే వైపే మెజార్టీ నేతలు వెళ్లిపోయారు. ఉద్ధవ్ వర్గంలో తగినంత అభ్యర్థులు లేకపోయినప్పటికీ 23 స్థానాలు కోరడం సరికాదని కాంగ్రెస్ నేత సంజయ్ నిరుపమ్ పేర్కొన్నారు. సీట్లు గెలుచుకోవడంపై నేతలు విభేదాలు మానుకోవాలని అన్నారు. శివసేన 23 సీట్లు డిమాండు చేయొచ్చు, కానీ వాటిని ఏమి చేస్తారని ప్రశ్నించారు. సంక్షోభం అనంతరం శివసేన నేతలు వెళ్లిపోయారని, వాళ్లకు అభ్యర్థుల కొరత ఉందని తెలిపారు. శివసేన, శరద్‌పవార్ ఎన్సీపీలో చీలికలు ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ఒక్కటే స్థిరమైన ఓట్ షేర్‌తో కనిపిస్తోందని ఆ పార్టీ నేతలు తెలిపారు.పార్టీల మధ్య సర్దుబాటు అవసరమని మాజీ ముఖ్యమంత్రి, మహారాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ చవాన్ అన్నారు. ప్రతి పార్టీ ఎక్కువ సీట్లు కోరుకుంటున్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా శివసేన 23 సీట్లు డిమాండ్ చేయడం సరికాదని వ్యాఖ్యానించారు.

భారత నావికుడు గల్లంతు

డెహ్రాడూన్: వాణిజ్యనౌకలో విధుల్లో ఉన్న ఒక నావికుడు అదృశ్యమయ్యారు. తుర్కియేలోని నౌకాశ్రయానికి వెళ్లే మార్గంలో నౌక నుంచి కనిపించకుండా పోయారు. దీనిపై నావికుడి కుటుంబం ఉత్తరాఖండ్ ప్రభుత్వాన్ని ఆశ్రయించింది. ఈ మిస్సింగ్‌పై అతడి కుటుంబం అనుమానాలు వ్యక్తం చేసింది. ఉత్తరాఖండ్‌కు చెందిన అంకిత్ సక్లానీ ముంబై సంస్థ ఎల్విస్ షిప్ మేనేజ్‌మెంట్‌లో నావికుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. డిసెంబర్ ఒకటిన ఆ సంస్థలో చేరినట్టు అతని భార్య పింకీ మీడియాకు వెల్లడించారు. డిసెంబర్ 18 నుంచి తన భర్త గురించి ఎలాంటి వివరాలు తెలియడం లేదన్నారు. 'నా భర్తకు నావికుడిగా 15 సంవత్సరాల అనుభవం ఉంది. ఎల్విస్ సంస్థకు చెందిన నౌకలో డిసెంబర్ 18 నాటికి అతడు తుర్కియేలోని నౌకాశ్రయానికి చేరుకోవాలి. దానికంటే ముందునుంచే నా భర్త నుంచి అనూహ్యమైన సందేశాలు రావడం మొదలైంది. కొత్త ఉద్యోగంలో చేరిన 10 రోజులు అంతాబాగానే ఉంది. ఆ తర్వాత నుంచి తాను కలత చెందానని, తాను తిరిగి రావాలనుకుంటున్నానని సమాచారం వచ్చింది. తనకు ఏదైనా జరిగితే సంస్థదే బాధ్యత అంటూ డిసెంబర్ 11న మరో సందేశం వచ్చింది. దాంతో నేను ముంబైకి చెందిన సంస్థను సంప్రదించాను. ప్రస్తుతం నౌక తుర్కియేకు వెళ్లే మార్గంలో ఉందని, డిసెంబర్ 18న అది అక్కడకు చేరిన తర్వాత అతడిని సంప్రదించడం వీలవుతుందని తెలిపింది. తుర్కియే చేరుకోవడానికి ముందే నా భర్త నౌక నుంచి సముద్రంలోకి దూకేశాడని డిసెంబర్ 18న సంస్థ నుంచి నాకు కాల్ వచ్చింది' అని ఆమె మీడియా ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై నావికుడి కుటుంబం అనుమానాలు వ్యక్తం చేస్తోంది. ఇంతకుముందు అతడి కోసం సముద్రంలో గాలిస్తున్నట్లు చెప్పిన సంస్థ... ఇప్పుడు తమకు ఎలాంటి సమాధానం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తంచేసింది. ఈ ఘటనపై దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తూ... సక్లానీ కుటుంబ సభ్యులు ఉత్తరాఖండ్ ప్రభుత్వాన్ని ఆశ్రయించారు. దీనిపై వారు తుర్కియే ఎంబసీకి లేఖ రాశారు.

'ఇండియా'కు మేమే నాయకత్వం వహిస్తాం

బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

కోల్‌కతా: రానున్న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పశ్చిమబెంగాల్‌లో కాషాయ పార్టీకి వ్యతిరేకంగా 'ఇండియా' కూటమి పోరాటానికి టీఎంసీ నాయకత్వం వహిస్తుందని ఆ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. గురువారం నార్త్ 24 పరగణాల జిల్లాలోని దేగంగాలో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఆమె ప్రసంగిస్తూ... బీజేపీ ప్రతిపక్ష నాయకులను దొంగలుగా పేర్కొనడాన్ని తీవ్రంగా ఖండించారు. మోదీ పాలనలో దేశం కేంద్ర సంస్థలచే నడిచే ప్రజాస్వామ్యంగా మారిందని విమర్శించారు. 'పశ్చిమ బెంగాల్‌లో సీపీఎం, బీజేపీ, కాంగ్రెస్‌లు పొత్తు పెట్టుకుని మనకు వ్యతిరేకంగా చురుగ్గా ప్రచారం చేస్తున్నాయి. ఇక్కడ టీఎంసీ నేతృత్వంలోని ఇండియా కూటమి భారత ప్రతిపక్ష కూటమి కాషాయ శిబిరాన్ని ఎదుర్కొంటుంది' అని ఆమె స్పష్టం చేశారు. బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చిన ప్రజలు అధికంగా నివసించే జిల్లాల్లో రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీ పౌరసత్వ అంశాన్ని తారుమారు చేస్తోందని మమత పేర్కొన్నారు. పౌరసత్వ అంశాన్ని బీజేపీ తన రాజకీయ ఎజెండా కోసం ఉపయోగించుకుంటోంది. ఈ అంశంపై ప్రజలను తప్పుదోవ పట్టిస్తోంది. గతంలో జిల్లా కలెక్టర్లు పౌరసత్వ విషయాలను నిర్ణయించగా... ఇప్పుడు ఆ అధికారాలు వారి నుండి తొలగించబడ్డాయని తెలిపారు. 'పౌరసత్వం లేకుంటే, వారు ఎలా ప్రభుత్వ పథకాలు, సేవలను ఎలా పొందగలుగుతారు' అని ఆమె ప్రశ్నించారు.

మతాలను రాజకీయాలకు వాడుకోవద్దు

రాజకీయాలకు అతీతంగా అన్ని మతాలను గౌరవించాల్సిన అవసరం ఉందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ పేర్కొన్నారు. ఆమె ఉత్తర 24 పరగణాల జిల్లాలోని చక్లాలో ఉన్న బాబా లోకేనాథ్ ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో మతాలను రాజకీయాలకు వాడుకోవడం మానుకోవాలని మమత కోరారు. ప్రపంచవ్యాప్తంగా ఏ మతం కూడా హింసను సమర్థించవని... కరుణ, ప్రేమ సోదరభావాన్ని పెపొందిస్తాయన్నారు. "మనం అన్ని మతాలను గౌరవించాలి. ప్రపంచంలోని ఏ మతం హింసను ప్రేరేపించమని బోధించదు. అన్ని మతాలు మనకు మరింత దయతో ఉండాలని... ప్రేమ, సోదరభావాన్ని వ్యాప్తి చేయాలని బోధిస్తాయి. ఎన్నికలు సమీపిస్తున్నప్పుడు మాత్రమే మతాలను గౌరవించడం లేదా రాజకీయం చేయడంలో మాకు నమ్మకం లేదు" అని ఆమె ఏ పార్టీ పేరును నేరుగా ప్రస్తావించకుండా అన్నారు. బెనర్జీ పశ్చిమ బెంగాల్ అందరికీ అనుకూలంగా ఉండే పర్యాటక కేంద్రంగా మాత్రమే కాకుండా మతపరమైన పర్యాటక కేంద్రంగా కూడా గుర్తించబడాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు.

దిల్లీని వీడని పొగమంచు

134 విమాన సర్వీసుల్లో జాప్యం

న్యూఢిల్లీ: రాజధాని న్యూదిల్లీలో పొగమంచు తీవ్రత ఏమాత్రం తగ్గలేదు. గురువారం ఉదయం ఇక్కడ విజిబిలిటీ జీరో మీటర్లకు పడిపోయింది. దాదాపు 134 విమాన సర్వీసుల్లో జాప్యం నెలకొంది. దిల్లీకి రాకపోకలు సాగించే జాతీయ, అంతర్జాతీయ విమానాలు అందులో ఉన్నాయి. మరోవైపు రైళ్ల రాకపోకలపైనా వాతావరణం ప్రతికూల ప్రభావం చూపుతోంది. సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్, ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ సహా 22 రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. పాలం విమానాశ్రయంలో 25 మీటర్లు, సఫ్దార్‌గంజ్‌లో 50 మీటర్ల దూరం మాత్రమే కనిపిస్తోంది. దిల్లీ నగరంలో ఉష్ణోగ్రత కొన్ని చోట్ల 6 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. ఉదయం 5.30 గంటల సమయంలో పొరుగున ఉన్న ఉత్తరప్రదేశ్, హరియాణా, వాయువ్య రాజస్థాన్‌లో విజిబిలిటీ 25 మీటర్లు ఉంది. దిల్లీ, పంజాబ్, హరియాణా, చండీగఢ్‌లలో 31వ తేదీ వరకు పొగమంచు అతితీవ్రంగా ఉండొచ్చని వాతావరణ శాఖ పేర్కొంది. నగరవాసులకు డిసెంబర్ 31 తర్వాత కొంత ఉపశమనం లభించవచ్చని పేర్కొంది. ప్రయాణాలు చేసేవారు అప్రమత్తంగా ఉండాలని వెల్లడించింది. వాయువ్య ప్రాంతాల్లో ఆరెంజ్ అలర్ట్‌ను కొన్నాళ్లు కొనసాగిస్తున్నట్లు తెలిపింది. రెండు రోజులపాటు ఉత్తరప్రదేశ్‌లో ఘజియాబాద్, అలీగఢ్ జిల్లాల్లో పాఠశాలల వేళలు మార్చేశారు. కొన్ని చోట్ల సెలవులు ప్రకటించారు. నిన్న పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో తొలిసారి అత్యల్పంగా 2 డిగ్రీల సెల్సియస్ నమోదైన విషయం తెలిసిందే.

భాష పేరుతో విధ్వంసాన్ని ఉపేక్షించం

డీకే శివకుమార్ హెచ్చరిక

బెంగళూరు: 'కన్నడ' పరిరక్షణ పేరిట ఎవరైనా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడాన్ని ఉపేక్షించబోమని కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ హెచ్చరించారు. రాష్ట్ర భాషను కాపాడేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వాణిజ్య, వ్యాపార సంస్థల నామఫలకాలపై కనీసం 60 శాతం కన్నడ ఉండేలా చూడాలంటూ బుధవారం స్థానికంగా తీసిన ర్యాలీలు ఉద్రిక్తతలకు దారితీసిన విషయం తెలిసిందే. మరోవైపు 'కర్నాటక రక్షణ వేదికె' అధ్యక్షుడు టీఏ నారాయణగౌడ సహా 29 మంది కార్యకర్తలకు బెంగళూరులోని మేజిస్ట్రేట్ కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. 'కన్నడ భాష కోసం పోరాడుతున్న వారికి మేం వ్యతిరేకం కాదు. వారిని గౌరవిస్తాం. అయితే విధ్వంసానికి పాల్పడితే ప్రభుత్వం కళ్లు మూసుకోదు. వారు నిరసన వ్యక్తం చేయొచ్చు. కానీ, ఆస్తులకు నష్టం కలిగించడం ఆమోదయోగ్యం కాదు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి పెట్టుబడిదారులు ఇక్కడికి వచ్చారు. ప్రజలు తమ జీవనోపాధి కోసం ఇక్కడ నివసిస్తున్నారు. ఈ పరిణామాలు వారిలో భయాందోళనలు కలిగించకూడదు. కన్నడ పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం. అధికారిక కార్యకలాపాలు రాష్ట్ర భాషలోనే ఉండాలని ముఖ్యమంత్రి కూడా మమ్మల్ని ఆదేశించారు. 60 శాతం కన్నడ విషయంలో ప్రభుత్వ ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయి. దీన్ని ఉల్లంఘించినవారికి నోటీసులు జారీ చేయడం వంటి మార్గాలు ఉన్నాయి' అని మీడియాతో డీకే అన్నారు.

మాలో గందరగోళం లేదు

దిల్లీ సమావేశం అసాధారణమేమీ కాదు

బీహార్ సీఎం నితీశ్‌కుమార్

పాట్నా: జేడీయూలో ఎటువంటి గందరగోళ పరిస్థితులు లేవని బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ స్పష్టం చేశారు. దిల్లీలో శుక్రవారం జరగబోయే పార్టీ జాతీయ కార్యవర్గ, మండలి సమావేశం జరగబోతుండటం సాధారణ వ్యవహారమేనని, ఏటా జరిగేదేనని చెప్పుకొచ్చారు. గురువారం దేశ రాజధానికి బయలుదేరడానికి ముందు అక్కడ వేచియున్న మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. జేడీయూ అధ్యక్షుడు రాజీవ్ రంజన్ సింగ్ (లలన్) సొంత పార్టీని పణంగా పెట్టి విధేయతతో మిత్రపక్షమైన ఆర్జేడీతో సన్నిహితంగా ఉంటున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఆయన రాజీనామా చేయబోతున్నారనే పుకార్లు ఉన్నాయి. గత ఏడాది ఆగస్టులో బీజేపీకి దూరమైన నితీశ్... ఇప్పుడు వెనుతిరుగుతున్నట్లు మీడియాలోని ఒక వర్గం పేర్కొంది. దీనపై అడిగిన ప్రశ్నలకు నితీశ్ స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. తనకు సమయం తక్కువగా ఉందంటూ సమాధానం దాట వేశారు. కాగా 'పార్టీ సమావేశం ఏడాదికోసారి జరిగేదే... ఇందులో అసాధారణమైనది ఏమీ లేదు' అని నితీశ్ చమత్కరించారు. దివంగత బీజేపీ నాయకుడు అరుణ్ జైట్లీ జయంతి సందర్భంగా ఇక్కడ జరిగిన ప్రభుత్వ కార్యక్రమానికి తన బాస్ (నితీశ్)తో కలిసి వచ్చిన ఆర్జేడీ అధ్యక్షుడు, లాలూ ప్రసాద్ కుమారుడైన ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ సమక్షంలో నితీశ్ ఈ వ్యాఖ్యలు చేశారు. బీహార్‌లో బీజేపీతో సుదీర్ఘకాలం పొత్తు పెట్టుకున్న నితీశ్... జైట్లీ, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి పట్ల తనకున్న వ్యక్తిగత అనుబంధం గురించి బహిరంగంగానే వెల్లడించారు. కాషాయ పార్టీతో సంబంధాలను తెంచుకున్నప్పటికీ వారి జ్ఞాపకార్థం ఇక్కడ జరిగే ప్రభుత్వ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అయితే బీజేపీతో రాజకీయం శత్రుత్వం ఉన్నప్పటిక పైన పేర్కొన్న దివంగత నాయకుల యెడల తన బాస్‌కు అభిమానంతో యాదవ్ శాంతించారు. జర్నలిస్టులు ఈ వివాదం గురించి ప్రశ్నించగా... 'ఇదంతా బీజేపీకి మద్దతు పలికే మీడియా పని, రాష్ట్రంలో మా ప్రభుత్వం ఏదైనా చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నప్పుడల్లా ఇది పని చేస్తుంది' అని యాదవ్ అన్నారు. ప్రస్తుతం 3.5 లక్షలమంది ఒప్పంద టీచర్లకు ప్రభుత్వ ఉద్యోగ హోదా ఇవ్వడంతో మరోసారి ఈ పుకార్లు వస్తున్నాయన్నారు. జేడీయూ గురించి పుకార్లను ఆ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు, మంత్రులు గట్టిగా తిరస్కరిస్తున్నప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయని యాదవ్ పేర్కొన్నారు. 'బీహార్‌కు చెందిన పార్టీ జాతీయ కార్యవర్గం , జాతీయ మండలి సమావేశాలను దిల్లీలో నిర్వహించడంలో అసాధారణం ఏమిటని నేను ఆశ్చర్యపోతున్నా' అని యాదవ్ పేర్కొన్నారు. బీహార్‌లో ఇండియా కూటమి పక్షాలకు సీట్ల పంపిణీ విషయంలో కూడా ఎలాంటి అవరోధాలు ఉండబోవని యాదవ్ స్పష్టం చేశారు. కాగా రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సామ్రాట్ చౌదరి కూడా అరుణ్ జైట్లీ స్మారక చిహ్నం వద్ద మాట్లాడుతూ... 'నితీశ్ కుమార్‌కు తమ పార్టీ తలుపులు మూసివేయబడ్డాయి' అని ప్రకటించారు. జేడీయూలో ఉన్న గొడవలపై మాకు ఎలాంటి ఆసక్తి లేదని స్పష్టం చేశారు. తమ పార్టీ రాబోయే లోక్‌సభ ఎన్నికలు, 2025లో జరగబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికలలో విజయం సాధించడంపై దృష్టి పెట్టిందని కూడా తెలిపారు.

ఉగ్రవాది సయీద్‌ను అప్పగించండి

పాక్‌ను కోరిన భారత్



న్యూఢిల్లీ: కరడుగట్టిన అంతర్జాతీయ ఉగ్రవాది, లష్కరే తోయిబా నేత హఫీజ్ సయీద్‌ను స్వదేశానికి తీసుకొచ్చేందుకు భారత్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. సయీద్‌ను అప్పగించాలని పాకిస్థాన్‌ను భారత్ అధికారికంగా అడిగినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. హఫీజ్‌ను అప్పగించేందుకు చట్టపరమైన ప్రక్రియ ప్రారంభించాలని కోరుతూ భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ... పాక్ ప్రభుత్వానికి అధికారిక అభ్యర్థన పంపినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. 2008 నవంబరు 26న ముంబైలో ఉగ్రమూకలు మారణహోమం సృష్టించారు. ఈ ఘటనతో పాటు మరెన్నో ఉగ్రదాడుల్లో హఫీజ్ సయీద్ కీలక సూత్రధారిగా ఉన్నాడు. భారత్‌లో మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల్లో సయీద్ ఒకడు. ఐక్యరాజ్య సమితి కూడా అంతర్జాతీయ ఉగ్రవాదిగా అతనిని ప్రకటించింది. అతడి తలపై అమెరికా 10 మిలియన్ డాలర్ల రివార్డ్ ప్రకటించింది. వీటితోపాటు ఉగ్ర కార్యకలాపాలకు ఆర్థిక సహకారం అందించారన్న ఆరోపణలతో అనేక మనీలాండరింగ్ కేసుల్లోనూ హఫీజ్‌పై కేసులు ఉన్నాయి.

ముంబై పేలుళ్ల కేసులో విచారణ ఎదుర్కొనేందుకు అతడిని తమకు అప్పగించాలని భారత్ చాలాసార్లు డిమాండ్ చేసింది. కానీ, భారత్-పాక్ మధ్య ఖైదీల అప్పగింత ఒప్పందం లేకపోవడంతో ఈ ప్రక్రియ క్లిష్టంగా మారింది. ఉగ్రవాదులకు నిధులు అందిస్తున్నారన్న కేసుల్లో హఫీజ్ 2019లో అరెస్టయ్యాడు. ఈ కేసులకు సంబంధించి అతడికి 31 ఏళ్ల జైలు శిక్ష పడింది. ప్రస్తుతం పాక్ జైల్లో ఉన్న హఫీజ్... అక్కడి నుంచే దేశ రాజకీయాలు శాసిస్తున్నట్లు కథనాలు చెబుతున్నాయి. సయీద్ ఏర్పాటు చేసిన 'ది పాకిస్థాన్ మర్కజీ ముస్లిం లీగ్' (పీఎంఎంఎల్) పార్టీ.. వచ్చే ఏడాది జరగబోయే పాక్ ఎన్నికల్లో పోటీ చేస్తోంది. ఇదే పార్టీ తరపున హఫీజ్ తనయుడు తల్హా సయీద్ ఎన్‌ఏ-127 స్థానం నుంచి బరిలోకి దిగుతున్నాడు.

అయోధ్యకు ఆహ్వానించలేదు: పవార్



ముంబై: అయోధ్యలోని రామ మందిరం ప్రారంభోత్సవానికి తనకు ఆహ్వానం అందలేదని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శరద్ పవార్ చెప్పారు. శరద్ పవార్ గురువారం మీడియాతో మాట్లాడుతూ కేంద్రం తనకు ఆహ్వానం పంపలేదని స్పష్టంచేశారు. వచ్చే ఏడాది జనవరి 22న అయోధ్యలో పవిత్ర ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం జరగనుంది. ఈ ప్రారంభోత్సవానికి కేంద్రమంత్రులు, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రతిపక్ష నేతలు సహా ప్రముఖులకు కేంద్రం ఆహ్వానం పంపింది. ఈ నేపథ్యంలో రామాలయ ప్రారంభోత్సవానికి మీరు వెళుతున్నారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు శరద్ పవార్ స్పందించారు. దీనికి సంబంధించి తనకు ఆహ్వానం అందలేదని ఆయన సమాధానమిచ్చారు. కేంద్రంలోని బీజేపీ రామమందిరాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటుందో లేదో చెప్పడం కష్టమని పవార్ విమర్శించారు. ఏది ఏమైనా ఎందరో సహకారంతో రామాలయం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. మరోవైపు సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి కూడా ఈ ప్రారంభోత్సవానికి హాజరుకావడం లేదని ఇప్పటికే ఆ పార్టీ ప్రకటించింది. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కూడా హాజరు కావడం లేదని ఆమె సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ సహా 6 వేల మందికి పైగా హాజరయ్యే అవకాశం ఉంది.

ఆజాద్ ఇంజినీరింగ్ షేర్లు అదుర్స్

ఏడు రెట్లు పెరిగిన సచిన్ పెట్టుబడి

న్యూఢిల్లీ: ఆజాద్ ఇంజినీరింగ్ లిమిటెడ్ షేర్లు గురువారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టయ్యాయి. ఇష్యూ ధర రూ.524తో పోలిస్తే బీఎస్ఈలో 35.49 శాతం ప్రీమియంతో రూ.710 దగ్గర అరంగేట్రం చేసింది. ఎన్ఎస్ఈలో 37.40 శాతం పుంజుకొని రూ.720 దగ్గర ట్రేడింగ్ ప్రారంభించింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.4,219.19 కోట్లుగా నమోదైంది. ఐపీఓలో షేర్లు అలాట్ అయిన వారు కనీసం 28 షేర్లకు రూ.14,672 పెట్టుబడిగా పెట్టారు. వారికి లిస్టింగ్‌లో ఒక్కో లాట్‌పై రూ.5,488 లాభం వచ్చింది. గత శుక్రవారం ముగిసిన ఆజాద్ ఇంజినీరింగ్ ఐపీఓకు 80.60 రెట్ల స్పందన లభించిన విషయం తెలిసిందే. రూ.240 కోట్లు విలువ చేసే తాజా షేర్లతో పాటు రూ.500 కోట్లు విలువ చేసే షేర్లను 'ఆఫర్ ఫర్ సేల్' కింద విక్రయించారు. ఐపీఓలో ధరల శ్రేణిని రూ.499-524గా నిర్ణయించారు. సమీకరించిన నిధులను మూలధన వ్యయం, రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనున్నట్లు కంపెనీ తెలిపింది. ఏరోస్పేస్, రక్షణ, ఇంధన, చమురు పరిశ్రమలకు చెందిన కంపెనీలకు ఆజాద్ ఇంజినీరింగ్ తమ ఉత్పత్తులను సరఫరా చేస్తుంటుంది. జనరల్ ఎలక్ట్రిక్, హనీవెల్ ఇంటర్నేషనల్, మిట్సుబిషీ హెవీ ఇండస్ట్రీస్, సీమెన్స్ ఎనర్జీ, ఈటన్ ఏరోస్పేస్, ఎంఏఎన్ ఎనర్జీ సొల్యూషన్స్ వంటి ప్రముఖ కంపెనీలు ఆజాద్ ఇంజినీరింగ్‌కు కస్టమర్లుగా ఉన్నాయి. ఆజాద్ ఇంజినీరింగ్‌లో సచిన్ టెండూల్కర్, సైనా నెహ్వాల్, వీవీఎస్ లక్ష్మణ్, పీవీ సింధు, నిఖత్ జరీన్ వంటి ప్రముఖ క్రీడాకారులకు వాటాలున్నాయి. లిస్టింగ్ తర్వాత టెండూల్కర్ పెట్టుబడి విలువ దాదాపు ఏడు రెట్లు పెరిగింది. ఈ ఏడాది మార్చిలో ఆయన ఒక్కో షేరును రూ.3,423 చొప్పున 14,607 షేర్లు కొనుగోలు చేశారు. తర్వాత కంపెనీ రూ.10 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరును రూ.2 ముఖ విలువ కలిగిన ఐదు షేర్లుగా విభజించింది. అలాగే ఒక్కో షేరుకు మరో ఐదు షేర్లను బోనస్‌గా జారీ చేసింది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే టెండూల్కర్ షేర్లు 4.5 లక్షలకు చేరాయి. ఫలితంగా ఒక్కో షేరు సగటు కొనుగోలు ధర రూ.110గా ఉంది. తాజా ఐపీఓలో ఆఫర్ ఫర్ సేల్ కింద ఆయన షేర్లను విక్రయించలేదు. ఈ లెక్కన ఆయన దాదాపు రూ.ఐదు కోట్లు పెట్టుబడి పెట్టగా... తాజా షేరు ధర ప్రకారం అది దాదాపు రూ.32 కోట్లకు చేరింది.

ప్రజల కోసం కమ్యూనిస్టుల పోరు

సీపీఐ వర్క్‌షాప్‌లో జల్లి విల్సన్, ఓబులేసు

విశాలాంధ్ర బ్యూరో- బాపట్ల: కమ్యూనిస్టులు తలలో నాలుకలా ప్రజలతో మెలగాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, గుజ్జుల ఓబులేసు పిలుపునిచ్చారు. స్థానిక రైల్వేస్టేషన్ ఎదురుగా గల రైస్ మిల్లర్ల అసోషియేషన్ మీటింగ్ హాల్‌లో గురువారం సీపీఐ జిల్లాస్థాయి శాఖకార్యదర్శుల శిక్షణ శిబిరం జిల్లా కార్యదర్శ తన్నీరు సింగరకొండ అధ్యక్షతన జరిగింది. తొలుత పట్టణంలోని శృంగారపురం సీపీఐ జిల్లా కార్యాలయం వద్ద పార్టీ జెండాను మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ ఆవిష్కరించి విప్లవ నినాదాలు చేశారు. పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా పాతబస్టాండ్ మీదగా డీఎస్పీ రోడ్ నుంచి మీటింగ్ హాల్‌కు చేరుకున్నారు. అనంతరం జరిగిన వర్క్‌షాప్‌లో రాష్ట్ర రాజకీయాలు, పార్టీ నిర్మాణం, పార్టీ శాఖల నిర్మాణం, ప్రజాసంఘాల నిర్మాణం తదితర అంశాలపై నాయయకులు వివరించారు. ఓబులేసు మాట్లాడుతూ నరేంద్ర మోదీ అధికారం కోసం దేశ ప్రజలను మభ్య పెట్టేలా వాగ్దానాలు చేస్తున్నారన్నారు. నల్లధనం వెలికితీత, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు వంటి హామీలు అమలు చేయలేదని విమర్శించారు. కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా...ఉన్న ఉద్యోగాలలో కోతపెట్టారని మండిపడ్డారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని విక్రయించడానికి మోదీ సర్కారు ప్రయత్నిస్తోందన్నారు. ఎందరో త్యాగాల ఫలితంగా ఏర్పడిన విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తే ఉరుకోబోమని హెచ్చరించారు. బీజేపీకి వ్యతిరేకంగా కలిసి వచ్చే ప్రతి పార్టీతో ఇండియా కూటమిగా ఏర్పడి పనిచేసేందుకు సీపీఐ ముందుంటుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రతిపక్ష నాయకుడు నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినాయకుడు పవన్ కల్యాణ్ బీజేపీని భుజాలపై మోసుకు తిరుగుతున్నారని విమర్శించారు. కడప ఉక్కు కర్మాగార నిర్మాణానికి శంకుస్థాపనలు చేయటమే గానీ పనిముందుకు సాగడం లేదన్నారు. ప్రధాని మోదీ మతోన్మాదాన్ని రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారని, రామమందిర నిర్మాణానికి ఇచ్చిన ప్రాధాన్యతను దేశ భద్రత, రక్షణ కోసం ఇవ్వడం లేదన్నారు. మణిపూర్ హింసపై కనీసం నోరు మెదపలేదని ఆరోపించారు. దేశ అభివృద్ధి, ప్రజల సంక్షేమం మరిచి మతోన్మాదాన్ని దేశవ్యాప్తంగా వ్యాప్తి చేస్తున్నారన్నారు. ఇక సీఎం జగన్ నాటి పాదయాత్రలో అంగన్వాడీ, మున్సిపాలిటీ, ఆశా వర్కర్లు, కాంట్రక్టు ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా అందరినీ రోడ్డు మీదకు తీసుకువచ్చారన్నారు.

మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ పీడిత, తాడిత ప్రజల అభ్యున్నతి కోసం పనిచేయటమే కమ్యూనిస్టుల కర్తవ్యమన్నారు. కమ్యూనిస్టుల సిద్ధాంతాలు, తీర్మానాలు ప్రజా ఉద్యమాల వైపు నడిపించేలా కార్యాచరణతో ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. కార్మిక, కర్షక, రైతు కూలీలు, శ్రమజీవులు, మహిళల సమస్యల పరిష్కారం కోసం ప్రజా పునాదిగా ఏర్పడిన సీపీఐ విశిష్టతను గ్రామస్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. మండల, పట్టణ, నియోజకవర్గ, జిల్లా కార్యదర్శులు, శాఖ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలు గుర్తించి ...పరిష్కారం కోసం పోరాటం చేయాలన్నారు. అధికారం లేకపోయినా 99 ఏళ్లుగా సీపీఐ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తోందన్నారు. మోదీ సర్కారు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో భారత్ బచావో మోదీ హఠావో నినాదంతో అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని సీపీఐ నాయకత్వం పనిచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు జేబీ శ్రీధర్, బత్తుల శామ్యూల్, కేఎల్‌డీ ప్రసాద్, బావిరెడ్డి ప్రభాకర్, వల్లెపు నరసింహం, కన్నెగంటి రమేశ్, అద్దంకి నాగేశ్వరరావు, చిరమల ప్రకాశ్‌బాబు, తుమ్మల పూర్ణచంద్రశేఖర్, జె.రత్నకుమారి, షేక్ షంషున్‌బీ, ముత్తిరెడ్డి శ్రీనివాస్, షేక్ కరిముల్లా, శవనం హరిబాబురెడ్డి, షేక్ కాలేషాగారి ఖాదర్‌బాషా, మల్లెల ఏసోబు, గర్నెపూడి ప్రసాద్, పొదిలి శ్రీమన్నారాయణ, గెల్లా వెంకటప్పయ్య, కోలా వీరాంజనేయులు, పడమటి భిక్షాలు, షేక్ సుభానీ, మొగిలి వెంకటేశ్వర్లు, నాగలక్ష్మి, ముత్తిరెడ్డి నాగేశ్వరరావు, పొట్లూరి రామాంజమ్మ, ముత్యాల గృహలక్ష్మి, ఏటగిరి శ్రీనివాస్, నిమ్మల చినప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ విచ్ఛిన్నానికే నూతన విద్యావిధానం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: దేశంలో విద్యా వ్యవస్థను విచ్ఛిన్నం చేసే విధంగా నూతన జాతీయ విద్యా విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొవచ్చిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ అన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సమావేశం దాసరి నాగభూషణరావు భవనంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ పక్కా ఆర్ఎస్ఎస్ ఎజెండాను కేంద్ర ప్రభుత్వం అమలుపరుస్తూ విద్యార్థుల మెదళ్లపై దాడికి పాల్పడుతోందని విమర్శించారు. అలాగే రాష్ట్రంలో సంక్షేమ వసతి గృహాలను గాలికొదిలేసి, ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తోందన్నారు. డిగ్రీలు, పీజీలు పూర్తిచేసి ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూస్తున్న యువత ఆశలతో ఆటలాడుకుంటున్నారని... కేవలం రాజకీయ లబ్ధి కోసమే ఆడుదాం ఆంధ్ర అనే పేరుతో యువకులను పక్కదారి పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. నిజంగా విద్యార్థులు, యువకులపై అంత ప్రేమ ఉన్నట్లయితే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. జగన్ ప్రభుత్వం విద్యార్థుల పాలిట శాపంగా మారిందన్నారు. ప్రజా వ్యతిరేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దింపడానికి విద్యార్థుల నడుం బిగింగించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర సమితి సమావేశంలో కొత్తగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బండి చలపతి , కుళాయి స్వామి, షాబీర్ బాష, రాజేంద్ర, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా వలరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నిండు గర్భిణికి వైద్యం కోసం

7 కిలోమీటర్ల డోలీమోత

మన్యంలో కానరాని రహదారులు

గిరిజన గ్రామాలకు అంబులెన్స్ కూడా రాలేని దుస్థితి

విశాలాంధ్ర- అనంతగిరి (అల్లూరి జిల్లా): అంబులెన్స్ రావడానికి రోడ్డు లేకపోవడంతో నిండు గర్భిణిని ఆస్పత్రికి చేర్చడానికి ఏడు కిలోమీటర్ల పాటు డోలీ కట్టి మోసు కెళ్లాల్సిన దుర్భర పరిస్థితి మన్యంలో నెలకొంది. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పెద్దకోట పంచాయతీ మడ్రేవు గ్రామానికి చెందిన కొండతాంబలి రాధకు నెలలు నిండి... గురువారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో పురిటి నొప్పులు రావడంతో చీకట్లో ఆస్పత్రికి తీసుకు వెళ్లలేక తెల్లవారే వరకు ఆగి... తెల్లారే సమయానికి మడ్రేబు నుండి దాయిర్తి వరకు డోలీ సహాయంతో తీసుకెళ్లారు. అక్కడ నుంచి అంబులెన్స్ అందుబాటులోకి రావడంతో పినుకోట పీహెచ్ సీకి తరలించారు. ఎట్టకేలకు సుఖ ప్రసవం తో ప్రస్తుతం తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు. అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఇక్కడ గర్భిణులకు, అనారోగ్యం పాలైన వారికి ఆస్పతికి తరలించాలంటే డోలీ మోతలు తప్పడం లేదు. మడ్రేవు పివిటిజి కొందు ఆదివాసీ గిరిజన గ్రామంలో 200 మంది నివసిస్తున్నారు. ఈ గ్రామం చుట్టూ 10 గ్రామాల్లో 2వేల మంది వరకు కొందు తెగ గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. వీరందరికీ ఏ చిన్న అనారోగ్యమైన డోలి తప్ప వేరే మార్గం లేదు. జిల్లాలోని జి అనంతగిరి మండలం పెద్దకోట, జి నబాడు, పినకోట మూడు పంచాయతీల మధ్య నుంచి 11 కిలోమీటర్ల దూరం తేనె కొండల మధ్య ప్రయాణం చేయవలసి ఉంది. 12 గ్రామాల పివిటిజి కొందు ఆదివాసి గిరిజనులకు చిన్న జ్వరం వచ్చిన ఇదే పరిస్థితి. దట్టమైన అడవి మధ్యలో నుంచి ఎత్తైన కొండల మధ్యలో గర్భిణీలనైనా, ఎవరైనా అనారోగ్యం బారిన పడినా డోలి ఏర్పాటు చేసి మోసుకుంటూ రావాల్సిన దుస్థితి నెలకొంది. గతంలో గుమ్మంతి నుండి రాచకిలం గ్రామస్తులు 150 మంది రెండు కిలోమీటర్లు శ్రమదానం చేసి రోడ్డు నిర్మాణం చేసుకుంటే... అనంతగిరి ఎంపీడీవో గ్రామాన్ని సందర్శించి... ఉపాధి హామీ పథకం ద్వారా రూ. 20 లక్షల రూపాయలు మంజూరు చేశారు. దీనికి అటవీ అధికారులు అడ్డు తగలడంతో ఉపాధి పనులు చేయకుండా నిలుపుదల చేశారు. గుర్రాలతో డోలు కట్టుకొని నాలుగు కిలోమీటర్ల పాదయాత్ర చేసి ఆందోళన చేసినా... అనంతగిరి ప్రత్యేక స్పందన కార్యక్రమంలో జిల్లా పరిషత్ పాలకవర్గ సమావేశం వద్ద పివిటిజి ఆదివాసి కొందు గిరిజనులు ఆందోళన చేసినా పరిస్థితిలో మార్పు రాలేదు. ప్రధానమంత్రి పి విటిజి డెవలప్మెంట్ మిషన్ పథకం, మిషన్ కనెక్ట్ పాడేరు పథకాలు ఎన్ని పెట్టినా... ప్రచార కటౌట్లకు, బోర్డులకి పరిమితం అవుతున్నాయి తప్ప కొందు ఆదివాసి గిరిజనులకు కొండ శిఖర గ్రామాల దరిచేరడం లేదు. ప్రజా సాధికార యాత్రలో మంత్రులు మెయిన్ రోడ్ల మీద ప్రయాణం సాగిస్తున్నారని, ఇటువంటి గ్రామాల్లో ప్రజా సాధికార యాత్ర చేస్తే వారికి పరిస్థితి అర్థమవుతుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అటవీశాఖ అనుమతులు ఇస్తే తామే చందాలు వేసుకొని రోడ్డు నిర్మాణం చేసుకుంటామని, అనేకసార్లు జిల్లా అధికారులకు తెలియజేసినా... నేటికీ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. సొంతంగా రోడ్డు వేసుకుందాం అనుకుంటే, ఫారెస్ట్ సెక్షన్లు కింద కేసులు పెడతామని బెదిరిస్తున్నారని, ఫారెస్ట్ అనుమతులు ఇవ్వండి అని కలెక్టర్‌కు అర్జీలు ఇస్తే పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

విలసిల్లుతున్న భారతీయ సాహిత్యం

పుస్తక మహోత్సవంలో వక్తలు

విశాలాంధ్ర-విజయవాడ: అనేక భాషలు, లిపి కలిగి వైవిధ్యభరితంగా భారతీయ సాహిత్యం విలసిల్లుతుందని వక్తలు అన్నారు. విజయవాడ పాలిటెక్నిక్ కళాశాలలో 34వ పుస్తక మహోత్సవం గురువారం ప్రారంభమైంది. కేంద్ర సాహిత్య అకాడమీ చైర్మన్ మాధవ్ కౌశిక్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ పరిస్థితులు, విజ్ఞాన శాస్త్ర విషయాలు, నాగరికత, సంస్కృతి వంటివి పుస్తకాల్లో నిక్షిప్తమై ఉంటాయని చెప్పారు. జ్ఞానంతో కూడిన నూతన సమాజ నిర్మాణానికి పుస్తక పఠనం దోహదం చేస్తుందన్నారు. ఇంట్లో కూర్చి కబుర్లు చెపితే విశ్వగురువు కాలేరన్నారు. తెలుగు భాష ప్రత్యేకమైనదని, తెలుగు రచయిత శివారెడ్డి రాసిన పుస్తకాలను వివిధ భాషాల్లోకి అనువదించారని తెలిపారు. పుస్తక మహోత్సవ కన్వీనర్ విజయకుమార్ కేంద్ర సాహిత్య అకాడమీలో సభ్యులు అయ్యారని తెలిపారు. కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కృత్తివెంటి శ్రీనివాసరావు మాట్లాడుతూ పుస్తక పఠనం... మానసిక ఒత్తిడిని దూరం చేసి ఆత్మస్థైర్యం పెంపొందిస్తుందన్నారు. పరిస్థితులను అర్థం చేసుకునే సామర్థ్యం, జ్ఞాపకశక్తిని వృద్ధి చేస్తుందని చెప్పారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత శివారెడ్డి మాట్లాడుతూ నేటితరానికి పుస్తకాలు చదటం అలవాటు చేయాలన్నారు. ఆంధ్రజ్యోతి అసోసియేట్ ఎడిటర్ ఎ.కృష్ణారావు మాట్లాడుతూ గ్రంథాలయం లేని ఊరు ఊరే కాదన్నారు. డి.విజయకుమార్ మాట్లడుతూ 2023లో రెండు పుస్తక మహోత్సవాలు జరుపుకోవటం విశేషం అన్నారు. తర్వనే వివిధ భాషల రచయితల సమ్మేళనాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు టీ.మనోహర్ నాయుడు మాట్లాడుతూ దేశంలో ప్రముఖ ప్రచురణ కర్తలు, కవులు, రచయితలు ఈ ఉత్సవాల్లో పాల్గొంటున్నారని తెలిపారు. కార్యదర్శి కె.లక్ష్మయ్య మాట్లాడుతూ దేశంలో చాలా ప్రాంతాల్లో పుస్తక ప్రదర్శనలు జరుగుతాయని కానీ విజయవాడ ప్రదర్శనను మాత్రమే బుక్ ఫెస్టివల్ అంటారన్నారు. కార్యక్రమంలో సొసైటీ గౌరవాధ్యక్షుడు బెల్లం బాబ్జీ, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు పాల్గొన్నారు.

కేతు విశ్వనాథరెడ్డి కృషి విశేషం

తెలుగు సాహిత్యంతో కేతువిశ్వనాథరెడ్డి తనదైన ముద్ర వేశారని, పాత్రికేయుడిగా, రచయితగా రాణించారని వక్తలు అన్నారు. పల్లెల నుంచి పట్టణాలకు వలస వచ్చి తమ అస్తిత్వం కోసం ఆవేదన చెందుతున్న వ్యక్తుల మనోభావాలను తన కథలతో అద్భుతంగా వర్ణించారని కొనియాడారు. 'దాపుడుకోక', 'జప్తు', 'వానకురిసే' తదితర కథలు చెప్పుకోదగినవన్నారు. కేతు విశ్వనాథరెడ్డి రచనలు సామాన్యులను, మేథావులను ఒకేలా ఆకట్టుకుంటాయన్నారు. పుస్తక మహోత్సవంలో భాగంగా కేతు విశ్వనాథ రెడ్డి సంస్మరణ సభకు సాహిత్యవేత్త ఓబులేసు అధ్యక్షన జరిగింది. సాహిత్యంలో కేతు విశ్వనాథరెడ్డి సాహితీకృషి గురించి సాహిత్యవేత్త మందలపర్తి కిశోర్ వివరించారు. పుస్తక మహోత్సవం ప్రాంగణానికి విశాఖకు చెందిన సాహితీపోషకులు వరహాలశెట్టి పేరు పెట్టారు. ఆయన గురించి ప్రముఖ రచయిత యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ వివరించారు. తెలుగు సాహితీ లోకంలో చిరస్థానం పొందారని, మహాశ్రీశ్రీ, చందు సుబ్బారావు లాంటి కవులు, సాహితీమూర్తులు బుక్‌సెంటర్ కేంద్రంగా నిత్యం సాహితీగోష్టులు నిర్వహించుకునేవారన్నారు. వరహాల శెట్టి పేరు విజయవాడ పుస్తకమహోత్సవ ప్రాంగణానికి పెట్టడం ద్వారా ఉత్తరాంధ్ర సాహితీమూర్తులందరినీ గౌరవం ఇచ్చినట్లైందని చెప్పారు. ప్రాంగణంలో పిల్లల ప్రతిభావేదికకు శ్రీరమణ పేరు పెట్టారు. ఆయన గురించి పన్నాల సుబ్రహ్మణ్యభట్టు వివరించారు. వ్యంగ్య రచయితల్లో పానుగంటి లక్ష్మీనరసింహారావు తర్వాత స్థానాన్ని శ్రీరమణకు ఇవ్వవచ్చన్నారు. సుతిమెత్తగా హృదయాలలోకి చొచ్చుకుపోయేలా మన చుట్టూ జరుగుతున్న ఘటనలపై మనకు నూతన స్పృహ కలిగించే శక్తి హాస్య రచయితలకు ఉందన్నారు. వెంకట సత్య స్టాలిన్ పాత్ర ద్వారా సమాజంలో ఆత్మస్తుతి, పరనిందల విస్తృతిని సూచించారని చెప్పారు. కొత్త అర్థాలు వచ్చేలా మామూలు మాటలతోనే కొత్త మాటలు కల్పించడంలో ఆయనకు ఆయనే సాటి అని, శ్రీరమణ రచనలు, మాటలు చిరకాలం ఉంటాయని సుబ్రహ్మణభట్టు అన్నారు.

మున్సిపల్ చర్చలు అసంపూర్ణం

సమ్మె ఆపాలని కోరిన మంత్రి సురేశ్

జనవరి 6లోపు పరిష్కరించాలని నేతలు డెడ్‌లైన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మున్సిపల్ కార్మిక సంఘాలతో గురువారం సచివాలయంలో మంత్రి ఆదిమూలపు సురేశ్ నిర్వహించిన చర్చలు అసంపూర్తిగా ముగిశాయి. పర్మినెంట్ చేయండి లేదా సమాన పనికి సమాన వేతనం చెల్లించండి అంటూ మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ పోరుమామిళ్ల సుబ్బరాయుడు, కో కన్వీనర్లు పరుచూరి దుర్గాప్రసాద్ (టీఎన్‌టీయూసీ) వైపీ రమణ(వైఎస్సార్‌టీయూసీ),ఆసుల రంగనాయకులు (ఏఐటీయూసీ), శంకరరావు (స్వతంత్ర సంఘం) పురపాలక శాఖమంత్రి ఆదిమూలపు సురేశ్‌తో చర్చలు జరిపారు. సచివాలయంలోని మంత్రి ఛాంబర్‌లో జేఏసీతో జరిపిన చర్చల్లో మంత్రి సురేశ్ మాట్లాడుతూ జనవరి 6 నుంచి మున్సిపల్ కార్మికుల జేఏసీ తలపెట్టిన సమ్మె ఆపాలని కోరారు. 12వ పీఆర్సీలో వేతనాలు పెంచుతామని, పర్మినెంట్ అంశం సాధ్యం కాదని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వర్కర్లకు, ఇంజనీరింగ్ విభాగ సిబ్బందికి, స్కూల్ స్వీపర్లకు, టాయిలెట్ వర్కర్లకు, డ్రైవర్లకు స్కిల్డ్, హై స్కిల్డ్ వేతనాలు చెల్లిస్తామని, డివిజన్ కార్యాలయాల్లో మస్టర్ వేయిస్తామని, సెలవుల డబ్బులు ఇస్తామని, పెండింగ్ డీఏలు, ఇంక్రిమెంట్లు కార్మికుల ఖాతాల్లో వేయిస్తామని, గ్రాట్యుటీ చెల్లింపు అంశం మంత్రుల బృందం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. నాన్ పీహెచ్ వర్కర్లకు సంక్షేమ పథకాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామని, పీఫ్, ఈఎస్ఐలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ హామీలను కార్మికసంఘ జేఏసీగా తాము నమ్మే పరిస్థితి లేదని, గతంలో అధికారుల విజ్ఞప్తి మేరకే ఈ నెల 27 నుంచి జరగాల్సిన సమ్మె జనవరి 6కు మార్చామన్నారు. కానీ ప్రభుత్వమే చూస్తాం...చేస్తామంటూ కాలయాపన చేస్తోందని, చర్చలను అవమానించేలా తొలుత ఒక సంఘంతో, తర్వాత జేఏసీతో చర్చలు జరపడం ఏమిటని నాయకులు ప్రశ్నించారు. ఈ చర్చలు ఫలప్రదం కాలేదని, నిర్దిష్టమైన హామీలకు సంబంధించి సర్క్యులర్లు జనవరి 6 లోపు ఇవ్వాలని, లేనిపక్షంలో నిరవధిక సమ్మె చేపడతామని నేతలు హెచ్చరించారు. ఈ చర్చల్లో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి బి.రామయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కోటి దాస్, ఉపాధ్యక్షులు కోట మాల్యాద్రి, దుర్గారావు, సమితి సభ్యులు రమేశ్, సుబ్రహ్మణ్యం, తారక రామారావు తదితరులు పాల్గొన్నారు.

బాల సాహిత్యంతోనే విద్యార్థుల వికాసం

అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: బాల సాహిత్యం చదివితేనే విద్యార్థులు మరింత వికాసం చెందుతారని... నేటి విద్యా వ్యవస్థలో బాల సాహిత్యం కొరవడటం విచారకరమని అభ్యుదయ రచయితల సంఘం (అరసం)జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ ఆవేదన వ్యక్తంచేశారు. విశాలాంధ్ర 23వ గుంటూరు పుస్తక మహోత్సవం సందర్భంగా స్థానిక లాడ్జిసెంటర్ ఏఎల్ బీఎడ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అభ్యుదయ సాహిత్యోద్యమ నేత డాక్టర్ ఆవంత్స సోమ సుందర్ సాహిత్య వేదిక, నయాగరా కవి, నాటక రచయిత, అనువాదకులు బెల్లంకొండ రామదాసు శత జయంతి సాహిత్య వేదికపై గురువారం సాయంత్రం 'కథ చెప్పండి' అనే అంశంపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో గురజాడ అప్పారావుతో ప్రారంభమైన ఆధునిక తెలుగు కథ అనేక మార్పులు, ప్రభావాలకు లోనై నేడు పాఠకులకు ఒక ప్రియమైన సాహిత్య ప్రక్రియగా మారిందన్నారు. కథలో ప్రపంచ సమస్యలు...సామాజిక సమస్యలు...కుటుంబ సమస్యలు... అనేక వర్గాల సమస్యలను వివరిస్తూ వేలాది మంది రచయితలు కథలు రాశారని పేర్కొన్నారు. లక్షల్లో కథలు వెలువడ్డాయని, పత్రికలు కథా సాహిత్యాన్ని ఎంతగానో ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కథలో ఒక ప్రధాన భాగం బాల కథా సాహిత్యమని, బాలల కోసం తెలుగులో ఎన్నో కథలు, పుస్తకాలు వెలువడినట్లు చెప్పారు. బాల సాహిత్య అభివృద్ధికి అభ్యుదయ రచయితల సంఘం కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగానే విశాలాంధ్ర పుస్తక మహోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం బీఎడ్ కళాశాల ఆవరణలో అరసం అధ్వర్యంలో కథ చెప్పండి... శతక పద్యం...తెలుగులో మాట్లాడండి...తదితర అంశాలపై క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనడం సంతోషం కలిగిస్తోందన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు కొణతం నాగేశ్వరరావు ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. అరసం జిల్లా శాఖ కార్యదర్శి బుల్లా రవిబాబు కార్యక్రమ నిర్వాహకులుగా వ్యవహరించారు. నగరంలోని వివిధ పాఠశాలల నుంచి సుమారు 50మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరచి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఈ నెల 30వ తేదీన జరిగే సభలో బహుమతులు అందజేయనున్నారు.

నేటి కార్యక్రమాలు : విశాలాంధ్ర పుస్తక మహోత్సవంలో భాగంగా హిందూ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జున రావు అధ్యక్షతన 'శతక పద్య పఠనం-విద్యార్థులకు పోటీ' శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి వక్తగా ప్రభుత్వ మహిళా కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ నల్లపనేని విజయలక్ష్మి హాజరుకానున్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో విద్యుత్ రంగంలో గణనీయమైన అభివృద్ధి సాధించామని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే విజయానంద్ పేర్కొన్నారు. విజయవాడ వెటర్నరీ కాలనీ లోని ది వెన్యూ కన్వెన్షన్ హాల్ లో గురువారం ఏపీసీపీడీసీఎల్ నాలుగో ఆవిర్భావ దినోత్సవం, 2024 డైరీ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ఎపీసీపీడీసీఎల్ సీఎండీ కే సంతోష్ రావు అధ్యక్షత వహించగా... ముఖ్య అతిధిగా ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ విద్యుత్ రంగ సంస్థల డైరీలు, క్యాలెండర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరంతరం 24/7 నాణ్యమైన విద్యుత్ పంపిణీకి కృషి చేస్తున్నామన్నారు. వ్యవసాయానికి పగటి పూట 9గంటల పాటు నాణ్యమైన విద్యుత్ ను సరఫరా చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయిలో స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటులో లక్ష్యాన్ని చేరుకోవటానికి ప్రత్యేక కార్యాచరణతో పనిచేస్తున్నట్లు తెలిపారు. వ్యవయసాయ విద్యుత్ మీటర్లు, హై వ్యాల్యూ కస్టమర్లు అంటే నెలకు 200 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగించే వినియోగదారులకు 51 లక్షల స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రస్తుత లక్ష్యమన్నారు. ఇంధన శాఖలో ఆర్డీఎస్ఎస్ కింద రూ. 13వేల కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, విద్యుత్ ఉత్పత్తిలో దేశీయ సగటు కన్నా మన రాష్ట్ర సగటు ఎక్కువగా ఉండటం అభినందనీయమన్నారు. ఏపీజెన్కో కృష్ణపట్నం యూనిట్‌లో 800 మెగావాట్ల ఉత్పత్తి సాధించగలిగామని, ఈ నెలలోనే విజయవాడ యూనిట్‌లో మరో 800 మెగావాట్ల విద్యుత& ఉత్పత్తి సాధిస్తామని చెప్పారు. దీంతో 35 నుంచి 40 మిలియన్ యూనిట్లు అదనంగా అందుబాటులోకి వచ్చినట్లయిందన్నారు.



Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.